www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -60 ఆదివారం 14 జూన్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# రెయిన్ అలర్ట్

**హైదరాబాద్‌లో భారీ వర్షం -పలు ప్రాంతాల్లో రహదారులు జలమయం**

**అధికారులను అప్రమత్తం చేసిన సిఎం రేవంత్**

**అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వెళ్లాలని ఆదేశం**

**హైదరాబాద్,జూన్13 (ప్రజావినికిడి):**
హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమిర్‌పేట, యూసుఫ్‌గూడ, సనత్ నగర్, ఫిలింనగర్, పంజాగుట్ట, ఎర్రగడ్డ, బోరబండ, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి, హైదర్ నగర్, ప్రగతినగర్, మూసాపేట్ ప్రాంతాల్లో వర్షం పడుతోంది. శంషాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారి జలమయమై చెరువును తలపిస్తోంది. రోడ్డంతా నీటితో నిండిపోవడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి **మిగతాది 2లో...**





# ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

**గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణం**

**మంత్రులతో కలసి శంకుస్థాపన చేసిన భట్టి**



**మంచిర్యాల,జూన్13(ప్రజావినికిడి):**
కేవలం దైవభక్తి కోసమే కాకుండా, సమాజంలో మార్పు కోసం విద్యకు , రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లాలోని ప్రసిద్ధ గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కలిసి ఘనంగా

# నా మీద కోపం నేతన్నల మీద చూపొద్దు

**కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్.. కార్యకర్తలకు దిశానిర్దేశం**

**సిరిసిల్లలో పార్టీ శ్రేణులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం**

**తనపై కోపంతో స్థానిక నేతలను వేధించొద్దని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి**

**ధాన్యం కొనుగోళ్లలో గన్నీ బ్యాగుల కొరతపై విమర్శలు**



**సిరిసిల్ల జూన్13 (ప్రజావినికిడి):**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం సిరిసిల్లలో నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన, పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తనతో ఉన్న వ్యక్తిగత విభేదాల కారణంగా సిరిసిల్లలోని బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకోవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బతుకమ్మ చీరల ఆర్డర్లను రద్దు చేయడం ద్వారా స్థానిక చిన్న తరహా **మిగతాది 2లో...**

# ఫ్రాన్స్‌లో జి-7 దేశాల సదస్సు

**విదేశీ పర్యటనకు బయల్దేరిన ప్రధాని మోడీ**



**న్యూఢిల్లీ,జూన్13 (ప్రజావినికిడి):**
భారత ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు బయల్దేరారు. ఫ్రాన్స్, స్లోవేకియాలలో మోదీ పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఆయా దేశాలతో ద్వైపాక్షిక, వాణిజ్య, వ్యాపార సంబంధాలపై చర్చలు జరపడంతోపాటు ఫ్రాన్స్‌లో జరిగే జీ7 దేశాల సదస్సులో కడా పాల్గొంటారు. ఈ సదస్సులో వివిధ దేశాధినేతలతో సమావేశమవుతారు. ఇందుకోసం న్యూఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి శనివారం ప్రధాని ప్రత్యేక విమానంలో **మిగతాది 2లో...**

# స్కూలు బస్సుల ఫిట్‌నెస్‌పై సర్వత్రా ఆందోళన

**15న తెరుచుకోనున్న పాఠశాలలు**

**వాహనాల ఫిట్‌నెస్‌పై రవాణాశాఖ మార్గదర్శకాలు జారీ**




2లో.

# అసోంలో కుప్పకూలిన వైమానికదళ విమానం

**ఐదురుగు వైమానికి సిబ్బంది మృతి?**

**గౌహతి,జూన్13 (ప్రజావినికిడి):**
అస్సాంలోని జోర్హాట్ వైమానిక స్థావరంలో విమాన ప్రమాదం చోటుచేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన ఏఎన్-32 రవాణా విమానం ఎయిర్‌బేస్ లోపల ల్యాండ్ అవుతుండగా, మంటలు చెలరేగడంతో కూలిపోయింది. ఈ ఘటనలో వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఐఏఎఫ్ అధికారులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన కో-పైలట్‌కు ఆసుపత్రిలో **మిగతాది 2లో...**



# కొత్త ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్



**జూన్ 30న బాధ్యతల స్వీకరణ**

**ఉపేంద్ర ద్వివేది అదే రోజు రిటైర్**

**సైన్యం ఆధునికీకరణలో కీలక పాత్ర**

**న్యూఢిల్లీ,జూన్13(ప్రజావినికిడి):**
భారత సైన్యానికి కొత్త ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జూన్ 30న కొత్త ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. **మిగతాది 2లో...**

# వీబీజీ రాంజీ స్కీం పట్ల ప్రభుత్వ నిరసన

**కేంద్రానికి లేఖ రాస్తామన్న మంత్రి సీతక్క**

**పథకం అమలుపై అధికారులతో సమీక్షించిన మంత్రి**



**హైదరాబాద్,జూన్13 (ప్రజావినికిడి):**
కేంద్రం జులై 1వ తేదీ నుంచి అమలు చేయాలని తలపెట్టిన వీబీజీ రాంజీ స్కీం పట్ల నిరసన తెలపాలని తమ ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తమ నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని తెలిపారు. వీబీజీ రాంజీ స్కీంను వ్యతిరేకిస్తూ ఇప్పటికే అసెంబ్లీలో తీర్మాణం చేశామని ప్రస్తావించారు. ఈ లేఖలో పొందుపర్చాల్సిన అంశాలపై పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్, కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జాయింట్ కమిషనర్ నరసింహులు, ఇతర అధికారులతో**మిగతాది 2లో...**



# బిజెపి కుట్రలకు మీనాక్షి బలి

**ఎలాంటి కేసు లేకున్నా నామినేషన్ తిరస్కరణ**

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శ**

**హైదరాబాద్,జూన్13 (ప్రజావినికిడి):**
మీనాక్షి నటరాజన్ విషయంలో బీజేపీ తీరు చూస్తుంటే ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా? లేక నియంత దేశంలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో **మిగతాది 2లో...**

# రెండేళ్లలో ఆరోగ్యశాఖలో గణనీయమైన ప్రగతి

**పేదల చెంతకు వైద్యారోగ్య సేవలు**

**ప్రభుత్వాసుపత్రుల్లో పెరిగిన రోగుల సంఖ్య**

**వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి**

**విజయవాడ,జూన్13(ప్రజావినికిడి):**
అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అందిస్తోందని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. రెండేళ్లలో ఆరోగ్య శాఖ పరంగా చేసిన అభివృద్ధి, ప్రణాళికలను ప్రజలకు చెబుతున్నామని తెలిపారు. అన్ని వర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. శనివారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. నేడు ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. మంచి సేవలు అందుతున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇది తాము చెబుతున్న మాటలు కాదని.. గణాంకాలే తమ పని తీరును చెబుతున్నాయని **మిగతాది 2లో...**



# వీబీజీ రాంజీ స్కీం పట్ల ప్రభుత్వ నిరసన

(మొదటి పేజి తరువాయి)
ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కశనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హమీకి అవసరమైన నిధుల్లో కనీసం 60 శాతం నిధులు కేంద్రం నుంచి రావాలన్నా నూతన స్కీంను అమలు చేయక తప్పదని అధికారులు సూచించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు నూతన పథకం అమలుకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేస్తున్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో నూతన పథకంపై అవలంబిస్తున్న విధానంపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. నూతన పథకం అమలుపై కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా కాకుండా.. నార్మెటివ్ పద్ధతిలో పని దినాలు కేటాయించే విధానాన్ని సవరించాలని కోరారు. వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల పాటు ఉపాధికి బ్రేక్ ఇవ్వాలన్న క్లాజ్‌ను తొలగించాలని అన్నారు. పంట సీజన్ కాలంలో వర్షాలు విస్తారంగా కురుస్తాయని వివరించారు. ఆ సమయంలోనే వన మహోత్సవాలు, మొక్కలు నాటే కార్యక్రమాలను ఉపాధి హమీ ద్వారా చేపడుతామని తెలిపారు. పంట సీజన్‌లో ఉపాధికి 60 రోజుల బ్రేక్ ఇస్తే.. మొక్కలు నాడటం ఆగిపోతుందని మంత్రి సీతక్క తెలిపారు. అది కేందప్రభుత్వం తీసుకువచ్చిన గ్రీన్ ఇండియా క్యాంపెయిన్‌కు విరుద్ధమని అన్నారు. ఆదివాసీ, కొండ ప్రాంతాల్లో పంట సీజన్ 60 రోజులు కూడా ఉండదని చెప్పారు. ఒకసారి పనులు మొదలుపెట్టాకా.. 60 రోజుల బ్రేక్ ఇవ్వడం సాధ్యం కాదని వివరించారు. ప్రస్తుత ఉపాధి హామీ విధానం నుంచి నూతన విధానంలోకి ఒక్కసారిగా మారడం కష్టమని చెప్పారు. అందుకే ఆయా రాష్ట్రాలకు కాస్త వెసులుబాటు ఇచ్చేలా నూతన చట్ట అమలును వాయిదా వేయాలని సూచించారు. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో వీబీజీ రాంజీని అమలు చేయాల్సి వస్తే.. ఉపాధి కూలీలకు ఏలాంటి నష్టం లేకుండా తాము చూస్తామని అన్నారు. అందుకనుగుణంగా జరిగే నష్టాన్ని రాష్ట్రం తరుపున భర్తీ చేసేందుకు ముసాయిదా రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో చర్చించిన తర్వాత నూతనపథకం అమలుపై తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# రెండేళ్లలో ఆరోగ్యశాఖలో గణనీయమైన ప్రగతి

(మొదటి పేజి తరువాయి)
మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. తిరుపతిలో జరిగిన బహిరంగ సభలో ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారన్నారు. ఓపీ సేవల నుంచి వైద్య సేవల వరకు అన్నింటిలో సరికొత్త మార్పులు తెచ్చామని తెలిపారు. ఎవరు ఆస్పత్రికి వచ్చినా ఆ రికార్డును డిజిటల్ చేశామన్నారు. రెండేళ్లలో హెల్త్ సెక్టార్‌లో గణనీయమైన మార్పులు తెచ్చామని మంత్రి తెలిపారు. ప్రజలు ఈ సేవల ద్వారా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని గొప్పగా చెబుతున్నామన్నారు. ఇందుకు సహకారం అందజేసిన అధికారులందిరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఆరోగ్య శాఖలో కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు పని చేస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నేడు ప్రజల్లో సంతృప్తికరమైన వాతావరణం నెలకొల్పామన్నారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా ఆరోగ్యాంధ్రప్రదేశ్ కీలక భూమిక పోషిస్తోందని తెలిపారు. తమకు అన్ని విధాలా సహకారం అందిస్తున్న సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఏపీలో బాధ్యతతో మెలిగే ప్రతిపక్షం లేదని.. గత ఐదేళ్ల కాలంలో జగన్ ఆరోగ్య శాఖను అనారోగ్య శాఖగా మార్చారని విమర్శించారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయడం వల్ల తాము చాలా సమర్ధనీయంగా పని చేశామన్నారు. తమకు ఛాలెంజింగ్ పని అప్పగించిన జగన్‌కు కూడా ధన్యవాదాలు అని అన్నారు.్గ ÷ళిడు ఆరోగ్య శాఖలో అనేక సంస్కరణలను సీఎం చంద్రబాబు తీసుకువచ్చారని మంత్రి తెలిపారు. రియాక్టివ్, క్యూరేటివ్ స్థాయి నుంచి ప్రిడెక్టీవ్ విధానాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రజల వద్దకే వెళ్లి 45 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయిస్తున్నామన్నారు. ముందుగానే వారి సమస్యలను గుర్తించి అవసరమైన మందులు అందిస్తున్నామని తెలిపారు. టెలిమెడిసిన్ ద్వారా ప్రజలకు ఉన్న సందేహాలను వైద్యుల ద్వారా సమాధానాలు ఇప్పిస్తున్నామని చెప్పారు. మీడియా కూడా తమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. ఎక్కడా ఎటువంటి సమస్య ఉన్నా... తమ దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యేలా చేశారన్నారు.

----------------

# స్కూలు బస్సుల ఫిట్‌నెస్‌పై సర్వత్రా ఆందోళన

**15న తెరుచుకోనున్న పాఠశాలలు**
**వాహనాల ఫిట్‌నెస్‌పై రవాణాశాఖ మార్గదర్శకాలు జారీ**

**హైదరాబాద్,జూన్13(ప్రజావినికిడి):**
ఈ నెల 15 నుంచి స్కూళ్లు తెరుచుకోనున్నాయి. కొత్త విద్యాసంవత్సరం మరికొద్ది రోజుల్లో ప్రారంభం కాబోతోంది. జూన్ 12 నుంచే ప్రారంభం కావాల్సిన స్కూళ్లు ఎండల కారణంతో 15 నుంచి తెరచుకోనున్నాయి. ప్రైవేట్ స్కూళ్ల బస్సుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఫిట్‌నెస్ లేకుండా బస్సులు తిప్పితే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయని వాపోతున్నారు. దీంతో విద్యాసంస్థల వాహనాలకు ఫిట్‌నెస్ తప్పనిసరి అని రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ పేరొన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఫిట్‌నెస్ లేని, విద్యార్థులను లెక్కకుమించి ఎక్కించుకుని నడుపుతున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెహికల్స్‌కు పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ తప్పనిసరి అని తెలిపారు. డ్రైవర్లు లైసెన్స్ లేకుండా, ఓవర్ లోడ్‌తో వాహనాలు నడిపితే వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా 25,987 విద్యా సంస్థల బస్సులు ఉండగా 22,158 బస్సులు ఫిట్ నెస్ సర్టిఫికెట్ పొందాయని, మిగిలిన 3,829 బస్సులు వెంటనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని చంద్రశేఖర్ గౌడ్ సూచించారు. ప్రైవేట్ స్కూళ్లు, కళాశాల యాజమాన్యాలు ఫీజులపై ఉన్న శ్రద్ధ, బస్సుల ఫిట్‌నెస్‌పై కూడా ఉండాలని పేర్కొంటున్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రమాదానికి దారి తీసే అవకాశముందని వాపోతున్నారు. స్కూల్ బస్సుకు పాఠశాల పేరు, ఫోన్ నెంబర్, చిరునామా, బస్సు ఎడమ వైపు పూర్తిగా కనిపించేలా ఉండాలి. వాహనాలు తప్పనిసరిగా పూర్తి కండీషన్‌లో ఉండాలని అధికారులు పేర్కొన్నారు. బస్సు, వ్యాన్‌కు రెండు వైపులా మిర్రర్స్ ఉండాలని, డ్రైవర్ వయస్సు 60ఏళ్లకు మించరాదని పేర్కొంటున్నారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, డ్రైవర్లు మూడు నెలలకోసారి షుగర్, బీపీ, గుండె పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అలాగే, ప్రతీ బస్సుకు ఒక అటెండర్ ఉండా లని, బస్సులో అగ్నిప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ ఫస్ట్ ఎయిడ్ కిట్, అగ్నిమాపక యంత్రం తప్పనిసరిగా వెల్లడిస్తున్నారు. విద్యార్థులను తీసుకొచ్చే వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలి. పాఠశాల ఉన్న ప్రాంతంలో రహదారిపై స్కూల్ జోన్ సైన్ బోర్డులు, రహదారి పై ప్రత్యేక రంగులు వేయించాలి. విద్యార్థులున్నారనే సంకేతాన్ని వాహనాల డ్రైవర్లు దూరం నుంచే గుర్తించేలా పిల్లల ఛాయాచిత్రాలతో బోర్డులు ఏర్పాటు చేయాలి. తరగతుల ప్రారంభం, ముగింపు సమయాల్లో రహదారిపై గేటు వద్ద రద్దీ సమస్య లేకుండా చూడాలి. పిల్లలు, వారి తల్లిదండ్రులు రోడ్డు దాటేలా జీబ్రా క్రాసింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వ హిస్తాం అని తెలిపారు. ఫిట్‌నెస్ లేకుండా తిరిగే స్కూల్ బస్సుల యాజమా న్యాలపై కఠినచర్యలు తీసుకుంటాం. ప్రైవేటు పాఠశాలల బస్సులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. భద్రతా ప్రమాణాలు పాటి స్తూ పాఠశాలల బస్సులు నడపాలి. అనుభవం ఉన్న డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి. తల్లిదండ్రులు కూడా బస్సుల స్థితిపై ఫీడ్‌బ్యాక్ తీసుకొని పాఠశాలల యాజమాన్యాలకు రీమార్కులు తెలియజేయాలి. ప్రమాదా లు జరుగకుండా పాఠశాల యాజమాన్యాలు, డ్రైవర్లు, తల్లిదంద్రు లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# రెయిన్ అలర్ట్



(మొదటి పేజి తరువాయి)
ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో 'హై అలర్ట్' ప్రకటించాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. వర్షాల వల్ల నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన సత్వర చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వాతావరణ శాఖ అందించే వర్ష సూచన వివరాల ఆధారంగా అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని సీఎం సూచించారు. నగరంలో సాధారణంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అక్కడ ముందస్తుగానే అత్యవసర బృందాలను మోహరించాలని ఆదేశించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్ శాఖ, వాటర్ బోర్డ్ సహా ఇతర అన్ని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. ఈ క్రమంలోనే చీఫ్ సెక్రటరీ, డీజీపీ, స్పెషల్ సీఎస్‌లతో పాటు నగరానికి చెందిన సీనియర్ అధికారులందరితో యుద్ధ ప్రాతిపదికన సమీక్షలు నిర్వహించి, తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

# ఫోన్ ట్యాపింగ్‌లో సిట్ విచారణకు ఎంపి హాజరు

**బిఆర్ఎస్ నీచంగా వ్యవహరించిందన్న అనిల్ కుమార్ యాదవ్**



**హైదరాబాద్,జూన్13 (ప్రజావినికిడి):**
తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ వేగవంతమైంది. ఇందులో భాగంగా శనివారం కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌ను ప్రత్యేక విచారణ బృందం సిట్ సుదీర్ఘంగా విచారించింది. జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయంలో దాదాపు అరగంట పాటు ఈ విచారణ కొనసాగింది. గత ప్రభుత్వ హయాంలో అనిల్ కుమార్ యాదవ్ ఫోన్ ట్యాపింగ్‌కు గురైనట్లు గుర్తించిన పోలీసులు, ఇందుకు సంబంధించిన కొన్ని సాంకేతిక ఆధారాలను ఆయన ముందు ఉంచి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. ఏ ఏ రోజుల్లో, ఏ సమయాల్లో ఫోన్ కాల్స్ ట్యాప్ చేశారనే వివరాలను అధికారులు ఆయనకు వివరించినట్లు తెలిసింది. ఇదే కేసులో అనిల్ కుమార్ యాదవ్ తండ్రి, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురైనట్లు సిట్ నిర్ధారించింది. అయితే, ఆయన వయోభారం, ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా నేరుగా వారి ఇంటికే వెళ్లి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయాలని సిట్ అధికారులు నిర్ణయించారు. సిట్ విచారణ అనంతరం ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ పార్టీ అత్యంత నీచ రాజకీయాలకు పాల్పడింది. నా ఫోన్ ట్యాప్ అయినట్లు పోలీసులు గుర్తించి నన్ను విచారణకు పిలిచారు. ఏ రోజు, ఏ టైమ్‌కు ట్యాపింగ్ జరిగిందో కొన్ని కీలక ఆధారాలను నా ముందు ఉంచి వివరాలు అడిగారు. అప్పట్లో మా పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల ప్రకారం మేము పార్టీ కార్యక్రమాలను ఆర్గనైజ్ చేసేవాళ్లం. అయితే, మేము ఏదైనా కార్యక్రమం తలపెట్టి ఇంటోంచి గడప దాటకముందే మా ఇంటి ముందు పోలీసులు వాలిపోయేవారు. మాకు అప్పట్లో అస్సలు అర్థం కాలేదు.. మేము ఎ÷-లాన్ చేసుకున్న విషయాలు పోలీసులకు ఎలా తెలుస్తున్నాయా అని ఆశ్చర్యపోయేవాళ్లం. ఇప్పుడు సిట్ ఆధారాలు చూపిస్తుంటే అసలు విషయం అర్థమైంది'. అని అనిల్ కుమార్ యాదవ్ చెప్పారు. తనతో పాటు తన తండ్రి అంజన్ కుమార్ యాదవ్ ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని అనిల్ కుమార్ మండిపడ్డారు. ఆయన స్టేట్‌మెంట్ తీసుకోవడానికి అధికారులు ఇంటికి వస్తామని చెప్పారని ఆయన వెల్లడించారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వెనుక ఉన్న సూత్రధారులు, పాత్రధారులు ఎంతటివారైనా సరే చట్టపరంగా శిక్ష అనుభవించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

# కొత్త ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

(మొదటి పేజి తరువాయి)
ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అదే రోజు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ధీరజ్ సేథ్ భారత సైన్యానికి తదుపరి అధిపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సేథ్ నేషనల్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందారు. 1986 డిసెంబర్‌లో ఆర్మర్డ్ కార్ప్స్‌లో అధికారిగా సైన్యంలో చేరారు. దాదాపు 40 ఏళ్లకు పైగా సాగిన సైనిక జీవితంలో కీలక బాధ్యతలు నిర్వహించారు.ఎడారి ప్రాంతాల్లో ఆర్మర్డ్ రెజిమెంట్‌కు నాయకత్వం వహించిన ధీరజ్ సేథ్, పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో ఆర్మ్‌డ్ బ్రిగేడ్‌కు కమాండర్‌గా పనిచేశారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను పర్యవేక్షించే దళాలకు కూడా నాయకత్వం అందించారు. లెఫ్టినెంట్ జనరల్ హోదాలో భారత సైన్యంలో అత్యంత కీలకమైన స్ట్రైక్ ఫార్మేషన్లలో ఒకటైన సుదర్శన్ చక్ర కార్ప్స్‌కు కమాండర్‌గా వ్యవహరించారు. ఢిల్లీ ప్రాంత జనరల్ ఆఫీసర్ ఇన్ కమాండింగ్‌గా కూడా పనిచేశారు. ఈ సమయంలో దేశీయ, అంతర్జాతీయ సైనిక కార్యక్రమాల సమన్వయం బాధ్యతలు నిర్వర్తించారు.సైన్యాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ధీరజ్ సేథ్ కీలక పాత్ర పోషించారు. సైనిక సామర్థ్యాల పెంపు, భవిష్యత్ వ్యూహాల రూపకల్పన, దళాల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాల్లో ఆయన సేవలు విశేష గుర్తింపు పొందాయి. ధీరజ్ సేథ్ హయ్యర్ కమాండ్ కోర్స్, నేషనల్ డిఫెన్స్ కాలేజ్‌లో ఉన్నత శిక్షణ పొందారు. ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లో నిర్వహించే ప్రతిష్ఠాత్మక కమాండ్ అండ్ స్టాఫ్ కోర్స్‌లో కూడా పాల్గొన్నారు. సమకాలీన సైనిక వ్యూహాలపై ఆయనకు విస్తృత అవగాహన ఉందని అధికారులు చెబుతున్నారు.

# ఫ్రాన్స్‌లో జి-7 దేశాల సదస్సు

(మొదటి పేజి తరువాయి)
బయల్దేరి వెళ్లారు. 1993 తర్వాత భారత ప్రధాని స్లోవేకియాలో పర్యటించనుండటం ఇదే మొదటిసారి. 14, 15 తేదీల్లో మోదీ స్లోవేకియాలో పర్యటిస్తారు. అక్కడి అధ్యక్షుడు పీటర్ పల్లెగ్రినితోపాటు ప్రధాని రాబర్ట్ ఫికోతో సమావేశమవుతారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించి, పలు ఒప్పందాలు కుదుర్చుకుంటారు. అనంతరం ఫ్రాన్స్ చేరుకుంటారు. 16, 17 తేదీల్లో ఫ్రాన్స్‌లోని ఈవియన్‌లో ఉంటారు. అక్కడ జరిగే జీ7 దేశాల సదస్సుకు హాజరవుతారు. ఈ సదస్సుకు విదేశీ నేతలు, ప్రతినిధులు హాజరవుతారు. వారితో దక్షిణాది ప్రపంచం గురించి చర్చిస్తామని మోదీ తెలిపారు. అనంతరం 18వ తేదీన ఫ్రాన్స్‌లోని ప్యారిస్‌లో జరిగే వివాటెక్ 2026 సదస్సులో పాల్గొంటారు.

# బిజెపి కుట్రలకు మీనాక్షి బలి

(మొదటి పేజి తరువాయి)
ఆయన మాట్లాడుతూ.. మీనాక్షి నటరాజన్‌పై కేసు ఏమీ లేదని.. నోటీసు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. రాజ్యసభలో బలం పెంచుకోవాలని బిజెపి కుట్రకు పూనుకున్నదని ఆరోపించారు. గాంధేయవాది, నిజాయతీకి నిలువుటద్దం మీనాక్షి నటరాజన్ అని పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆఫీసు కల్పించుకుని కేసును తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. ఈ విషయంలో ఉరి వేసినా తప్పులేదన్నారు. ప్రధాని నియంతలా వ్యవహరించడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టులో కూడా న్యాయం జరగలేదన్నారు. బీజేపీ ఫాసిస్టు విధానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. మీనాక్షి తనకు సోదరి లాంటివారన్నారు. 24 గంటల్లో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా స్పందించకపోవడం విచారకరమని తెలిపారు.మీనాక్షిని బలి చేశారని.. ఆమె విషయంలో కొంతమంది బీజేపీ నేతలు సానుభూతి తెలిపినట్లు తెలిసిందని మహేశ్ అన్నారు. బీజేపీ నేతలు దిగజారి ప్రవర్తిస్తున్నారని విమర్శలు గుప్పించారు. లీకు వీరులు.. గ్రీకు వీరులు ఉంటే సీఎం సమగ్రంగా విచారిస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి తమపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విభేదాలు సహజమని... అంత మాత్రాన కుట్రకు పాల్పడరన్నారు. ఓటు చోరీ చేసి.. ఇప్పుడు సీటు చోరీ చేశారంటూ వ్యాఖ్యానించారు. ప్రధాని ఇంతలా దిగజారి ప్రవర్తించడం బాధాకరమని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## అసోంలో కుప్పకూలిన వైమానికదళ విమానం

(మొదటి పేజి తరువాయి)
చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఏఎన్-32 జెట్ దృఢమైన, రెండు ఇంజన్లు గల టర్బోప్రాప్ సైనిక రవాణా విమానం. తీవ్రమైన వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా దీనిని రూపొందించారు. ఇది ఎత్తైన ప్రదేశాలలోని ఎయిర్‌ఫీల్డ్‌లలో, వేడి ఉష్ణమండల వాతావరణాల్లోనూ సమర్థంగా పనిచేస్తుంది. 7.5 టన్నుల సరకును, 50 మంది ప్రయాణికులను, 42 మంది పారాట్రూపర్‌లను రవాణా చేయగలదు. ప్రకృతి విపత్తుల సమయంలో మారుమూల ప్రాంతాలలో సామగ్రిని జారవిడవడానికి ఈ విమానాన్ని విస్తృతంగా ఉపయోగిస్తారు.

# ఆలయాల అభివృద్ధికి పెద్దపీట



(మొదటి పేజి తరువాయి)భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారంతా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. విద్య ద్వారా మాత్రమే సమాజంలో ఉన్నతమైన మార్పులు తీసుకురావచ్చని తాము గట్టిగా నమ్ముతున్నట్లు చెప్పారు. గతంలో రేవంత్ రెడ్డి చేపట్టిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర మూడేళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన పిప్పిరి బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి గూడెం ఆలయ అభివృద్ధికి నిధులు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ మాట ఇచ్చిన కేవలం 37 రోజుల్లోనే నిధులు మంజూరు చేసి, ఈ రోజు భూమి పూజ చేసుకోవడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గూడెం సత్యనారాయణ స్వామి ఆలయాన్ని రూ. 70 కోట్లతో అద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు తమ ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 2,216 కోట్లతో వివిధ దేవాలయాలను అభివృద్ధి చేసిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇందులో భాగంగానే ఇటీవల సరస్వతీ పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించామని, అలాగే రాబోయే గోదావరి పుష్కరాల కోసం కూడా రూ. 802 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒకవైపు దైవభక్తి కోసం నిధులు ఇస్తూనే, మరోవైపు అన్నదాతలను ఆదుకునేందుకు రూ. 74 కోట్ల వ్యయంతో 'గూడెం లిఫ్ట్ ఇరిగేషన్' పనులను కూడా చేపడుతున్నామని, దీనివల్ల స్థానిక రైతులకు సాగునీటి కష్టాలు శాశ్వతంగా తీరుతాయని డిప్యూటీ సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

# నా మీద కోపం నేతన్నల మీద చూపొద్దు

(మొదటి పేజి తరువాయి)
పరిశ్రమలను ప్రభుత్వం దెబ్బతీసిందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కనీసం గన్నీ బ్యాగులు కూడా అందుబాటులో లేవని, ఉన్నవాటిని ఇతర అవసరాలకు మళ్లించారని విమర్శించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 900 రోజులైనా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పార్టీ ముఖచిత్రంగా ప్రొజెక్ట్ చేయాలని, ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఎకో టౌన్ డంపింగ్ యార్డుపై పోరాటం

**మంచిరెడ్డి కిషన్ రెడ్డి మద్దతు**

**బండరావిరాల గ్రామస్తుల ఆందోళన**

**స్పందించకపోతే కలెక్టరేట్ ముట్టడి..**



**రంగారెడ్డి జిల్లా,జూన్ 13,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మేట్ మండలం బండరావిరాల గ్రామ సర్వే నంబర్ 268 లో 494 ఎకరాలలో ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే ఎకో టౌన్ (డంపింగ్ యార్డుకు) వ్యతిరేకంగా స్థానిక ప్రజలు తమ నిరసనను ఉధృతం చేశారు. ఈ నేపథ్యంలో, డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా తాము చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వాల్సిందిగా కోరుతూ బండరావిరాల గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు శనివారం నాడు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామస్తుల వినతిపై మాజీ ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా గ్రామ ప్రజలు చేస్తున్న న్యాయపరమైన పోరాటానికి తన పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ విషయమై అధికారులు తక్షణమే స్పందించి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే, ప్రజలతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడించడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ విషయంపై ఆయన అనుసరిస్తున్న వైఖరి సరైనది కాదంటూ మంచిరెడ్డి కిషన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యంతో ఆడుకునేలా నివాస ప్రాంతాల వద్ద డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్,పాటు ఉప సర్పంచ్ దూస శంకర్ ముదిరాజ్, వార్డు సభ్యులు నేమురగోముల మహేష్,కన్నె భరత్ యాదవ్, ఏర్పుల హరికృష్ణ, కందికంటి అనూష ప్రవీణ్,గుండ్ల భవాని శివ ముదిరాజ్,గ్రామ యువ నాయకులు కవాడి దయాకర్ రెడ్డి,గుండ్ల సతీష్ యాదవ్,కొత్త శ్రీకాంత్ గౌడ్,ఒంగూరి రమేష్,గుండ్ల శ్రీకాంత్,గుండ్ల మల్లేష్,కవాడి ఉదయ్ తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రైతుల ముంగిటకు 'ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్'

**ఎరువుల పంపిణీలో పారదర్శకతే లక్ష్యం -వ్యవసాయ శాఖ అదనపు డైరెక్టర్ విజయ్ కుమార్**

**షాద్‌నగర్ లో ఎరువుల దుకాణాల తనిఖీ - వ్యవసాయ శాఖతో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమీక్ష ఎఫెక్ట్**



షాద్ నగర్ రాఘవేంద్ర ఫర్టిలైజర్స్ లో పరిశీలిస్తున్న అదనపు డైరెక్టర్




**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రైతులు ఎరువుల కోసం ఎదుర్కొంటున్న ఇబ్బందులను, క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్'ను తీసుకువచ్చిందని రాష్ట్ర వ్యవసాయ కమిషనరేట్ అదనపు డైరెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో స్థానిక వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి రాఘవేంద్ర ఫర్టిలైజర్ తదితర షాపులను ఆయన పరిశీలించి తనిఖీ చేశారు. అదేవిధంగా నందిగామ మండలంలో ఆయన వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో కలిసి ఈ యాప్ పనితీరును,డీలర్ షాపుల వద్ద అమలవుతున్న విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ తనిఖీ చేశారు. నిన్న వ్యవసాయ శాఖ అధికారులతో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమీక్ష సందర్భంగా ప్రస్తావించిన పలు సమస్యలను గుర్తించి అధికారులు మరుసటి రోజు శనివారం రంగంలోకి దిగడం విశేషం. ఈ సందర్భంగా అదనపు డైరెక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ,గత డిసెంబర్‌లో రైతులు ఎరువులు కొనుగోలు చేయడానికి గంటల తరబడి క్యూ లైన్లలో పడిగాపులు కాయడం,బ్లాక్ మార్కెటింగ్,అధిక ధరలకు విక్రయించడం, బలవంతంగా ఇతర వస్తువులను అంటగట్టడం వంటి సమస్యలు అనేకం తమ దృష్టికి వచ్చాయన్నారు. వీటన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ నూతన సాంకేతికతను అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన వివరించారు. ఈ యాప్ ద్వారా రైతులు తమ ఇంటి వద్ద నుంచే సులభంగా ఎరువులను బుక్ చేసుకోవచ్చని, దీనివల్ల సమయం ఆదాతో పాటు పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రాథమికంగా ఈ విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా రంగారెడ్డి,మేడ్చల్ జిల్లాలతో సహా రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. సాంకేతిక సమస్యలకు తక్షణ పరిష్కారాలు యాప్ అమలులో వస్తున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నట్లు విజయ్ కుమార్ తెలిపారు.

**ఓటీపీ విధానం**

కొనుగోలు సమయంలో కొందరు రైతుల వేలిముద్రలు పడక తలెత్తుతున్న ఇబ్బందులను గమనించి,వెంటనే కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని, దీంతో వేలిముద్రల స్థానంలో ఓటీపీ ద్వారా ఎరువులు కొనుగోలు చేసే సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చామని వివరించారు.

**అదే రోజు కొనుగోలు:**

గతంలో యాప్‌లో ఎరువులు బుక్ చేసుకున్న రెండు రోజుల తర్వాత కొనుగోలు చేయాలన్న నిబంధన ఉండేది. కానీ,రైతుల విజ్ఞప్తి మేరకు ఇప్పుడు బుక్ చేసుకున్న రోజే ఎరువులు పొందే వెసులుబాటు కల్పించినట్లు ఆయన స్పష్టం చేశారు.

**కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

యాప్‌లో స్టాక్ కనిపించకపోవడం, వ్యవసాయ విస్తీర్ణం (హెక్టార్లు/ఎకరాలు) నమోదులో వస్తున్న వ్యత్యాసాలు వంటి లోపాలను పరిష్కరించేందుకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ నిరంతరం పనిచేస్తోందని, డీలర్లు లేదా రైతుల నుండి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. గ్రామానికో ముగ్గురు వాలంటీర్లు రైతులకు సేవలు అందించేందుకు ప్రతి గ్రామానికి ముగ్గురు 'సాయిల్ హెల్త్ వాలంటీర్ల'ను ప్రభుత్వం నియమించిందని విజయ్ కుమార్ తెలిపారు. వీరు గ్రామాల్లో మట్టి నమూనాలను పరీక్షించి తగిన ఎరువుల వాడకంపై రైతులకు సూచనలు ఇస్తారని,అలాగే స్మార్ట్‌ఫోన్ లేని రైతులకు లేదా యాప్ వాడకం తెలియని వారికి ఎరువులు బుక్ చేయడంలో ఉచితంగా సహాయపడతారని వివరించారు. పూర్తి స్థాయిలో ఈ యాప్ అందుబాటులోకి వస్తే ఎరువుల కొనుగోలు ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిణి (డిఏ ఓ)శైలజ, వ్యవసాయ శాఖ ఏడీఎస్‌లు (ఏడిఎస్) సత్యం బాబు,మాధవి, షాద్‌నగర్ ఏడీ రమాదేవితో పాటు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇతర ఏడీఎస్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 12వ మహాసభలను జయప్రదం చేయండి

**షాద్‌నగర్ డివిజన్ కన్వీనర్ శ్రీను నాయక్ పిలుపు**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా 12వ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం షాద్‌నగర్ డివిజన్ కన్వీనర్ శ్రీను నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రంగారెడ్డి జిల్లా 12వ మహాసభలు జూన్ 14న షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో గత మూడు సంవత్సరాలుగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటాలు, సాధించిన విజయాలు, ఎదురైన సవాళ్లపై సమగ్రంగా సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవడంతో పాటు వ్యవసాయ కార్మికుల హక్కుల సాధన కోసం చేపట్టాల్సిన ఉద్యమాలపై చర్చించనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని శ్రీను నాయక్ వెల్లడించారు. జిల్లాలోని వ్యవసాయ కార్మికులు,సంఘ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మహాసభలకు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.




# నిమ్స్ నూతన డైరెక్టర్ డా. రాహుల్ దేవ్ రాజ్‌కు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుభాకాంక్షలు





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** హైదరాబాద్‌లోని ప్రముఖ వైద్య సంస్థ నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డా. రాహుల్ దేవ్ రాజ్ ను షాద్‌నగర్ ఎమ్మెల్యే,ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు గాంచిన నిమ్స్ ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే పేద మరియు మధ్యతరగతి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. డా.రాహుల్ దేవ్ రాజ్ నాయకత్వంలో నిమ్స్ ఆసుపత్రి మరింత అభివృద్ధి సాధించి ప్రజలకు ఆదర్శవంతమైన వైద్య సేవలు అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.రాజు,సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డితో షాద్‌నగర్ కాంగ్రెస్ నాయకుడు కృష్ణారెడ్డి మర్యాదపూర్వక భేటీ



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** షాద్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (SAAP) మాజీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డిను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సమకాలీన రాజకీయ పరిణామాలు, యువత అభివృద్ధి, క్రీడల ప్రోత్సాహం వంటి అంశాలపై పరస్పరం చర్చించినట్లు తెలిసింది. బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా సేవలందించారు. ఈ భేటీలో పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ భవిష్యత్‌లో ప్రజా సేవా కార్యక్రమాల్లో మరింత చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.

# చింతలకుంట అండర్‌పాస్ రోడ్డు మరమ్మత్తు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**.. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..**



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):** చింతలకుంట అండర్‌పాస్ వద్ద జరుగుతున్న రోడ్డు మరమ్మత్తు పనులు నత్తనడకన సాగుతుండటంపై ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రోజు చింతలకుంట అండర్‌పాస్ వద్ద జరుగుతున్న పనులను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి,ఎల్బీనగర్ ట్రాఫిక్ ఏసీపీ నవీన్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏం.ఏం.సి.ప్రాజెక్ట్ ఈ.ఈ.రోహిణితో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే,దాదాపు రెండున్నర నెలల క్రితం ప్రారంభమైన రోడ్డు మరమ్మత్తు పనులు ఇప్పటికీ పూర్తికాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు పనులు ఆలస్యం కావడం వల్ల హయత్‌నగర్, విజయవాడ వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. యూ-టర్న్ కోసం ఎల్బీనగర్ రింగ్ రోడ్డు వరకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ప్రయాణ సమయం పెరగడమే కాకుండా ట్రాఫిక్ సమస్యలు కూడా అధికమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రతిరోజూ వేలాది మంది ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు ఈ మార్గంలో ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు రేయింబవళ్లు పనిచేసి చింతలకుంట అండర్‌పాస్ రోడ్డు మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేసి వచ్చే పది రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రాజెక్ట్ వర్క్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# కమిట్‌మెంట్ గల నాయకుడు నడికుడ యాదగిరి యాదవ్

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్ల నర్సింహారెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,22వ వార్డు నాయకులు నడికుడ యాదగిరి యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,నడికుడ యాదగిరి యాదవ్‌ను జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్ల నర్సింహారెడ్డికి పరిచయం చేశారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసే కమిట్‌మెంట్ గల నాయకుడిగా యాదగిరి యాదవ్ సేవలను కొనియాడారు. పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేస్తూ కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యాదగిరి యాదవ్ కీలక పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యాప్ వినియోగంపై రైతులకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలి

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ -ప్రతి ఊరిలో ఆదర్శ రైతులకు శిక్షణ ఇవ్వాలి**

**వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల సమావేశంలో ఎమ్మెల్యే కీలక సూచనలు**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
వ్యవసాయ రంగంలో ఎరువుల పంపిణీ కోసం ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన డీఏపీ యాప్ విధానంతో రైతులు,ఫెర్టిలైజర్ వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,దీనిపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో నందిగామ లో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని రైతుల సమస్యలపై గళమెత్తారు.

**అవగాహన లేకనే ఎరువుల నిల్వలు:**
సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ, రైతులు పత్తి,వరి, మొక్కజొన్న తదితర పంటలకు ఎంత మోతాదులో ఎరువులు వాడాలో సరైన శాస్త్రీయ అవగాహన లేకుండా వాడుతున్నారని పేర్కొన్నారు. గతంలో యూరియా దొరకదేమోననే వదంతులతో రైతులు భయాందోళనలకు గురై,పది బస్తాలు అవసరమయ్యే చోట ఇరవై బస్తాలు కొనుగోలు చేసి నిల్వ చేసుకునేవారని గుర్తుచేశారు.ఈ క్రమంలో యూరియా పంపిణీకి యాప్ విధానం తీసుకురావడంతో ఆ సమస్య చాలా వరకు పరిష్కారమైందని ఆయన తెలిపారు.

**కొత్త యాప్‌తో సాంకేతిక చిక్కులు:**
యూరియా తరహాలోనే ఇప్పుడు పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న డీఏపీ యాప్‌లో అనేక సాంకేతిక లోపాలు (టెక్నికల్ ఎర్రర్స్) తలెత్తుతున్నాయని ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల డీలర్లు, రైతులు ఎరువులు తీసుకోలేక తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా పట్టణ ప్రాంతానికి దగ్గరగా ఉన్నప్పటికీ, సామాన్య రైతులకు స్మార్ట్‌ఫోన్ వినియోగం,యాప్ ద్వారా ఎరువుల వివరాలు నమోదు చేయడంపై ఇంకా పూర్తిస్థాయి అవగాహన రాలేదని స్పష్టం చేశారు.విధానాలు రూపొందించే అధికారుల అంచనాలకు,క్షేత్ర స్థాయిలో సామాన్యులు పడుతున్న ఇబ్బందులకు వ్యత్యాసం ఉందన్నారు.

**గ్రామాల్లో ఆదర్శ రైతులకు శిక్షణ:**
రాబోయే సీజన్ నాటికి ఈ యాప్ ఇబ్బందులను అధిగమించడానికి వ్యవసాయ అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే శంకర్ సూచించారు. గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.ప్రతి గ్రామం నుంచి ఇద్దరు, ముగ్గురు ఆదర్శ రైతులను ఎంపిక చేసి,వారికి యాప్ వినియోగంపై ముందుగా శిక్షణ ఇస్తే..వారు ఆయా గ్రామాల్లోని మిగతా రైతులకు ఎరువుల కొనుగోలులో సహాయపడతారని ఆయన అధికారులకు ఓ చక్కటి పరిష్కారాన్ని సూచించారు.
ఈ కీలక సమావేశంలో వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్లు కే.విజయ్ కుమార్,బి. నరసింహారావు, ఏడీఏ లు మాధవి, సత్యంబాబు, ఏడీఎస్ శైలజతో పాటు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ఖమ్మం పట్టణం రాపర్తి నగర్ లో చిన్నారి పై అత్యాచారం ఘటన**

**తక్షణ సహాయ నిమిత్తం 50,000 అందించిన షాద్ నగర్ ఎమ్మెల్యే**

**నిదితుడి పై కఠిన చర్యలు తీసుకుంటామని బాలికా తల్లిదండ్రులకు హామీ**






**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ఖమ్మం జిల్లాలోని రాపర్తి నగర్‌లో జరిగిన ఘటనలో తీవ్ర గాయాలపాలై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ పరామర్శించారు. ఈ దారుణ ఘటనలో, మహమ్మద్ గౌస్ అనే 49 ఏళ్ల స్థానిక డ్రైవర్,12 ఏళ్ల మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడి , ఆమెను ఒక అపార్ట్‌మెంట్ భవనం పైకప్పు పైనుంచి కిందకు తోసేశాడు.ఈ సంఘటన 2026 జూన్ 6వ తేదీన జరిగింది.ఆ మైనర్ బాలిక కొత్తగూడెం నుండి అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న తన తాతను కలవడానికి వచ్చింది. నిందితుడు ఆమెను ఒక మూలకు నెట్టి, లైంగికంగా వేధించడానికి ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించి కేకలు వేయడంతో, తన నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి అతను ఆమెను భవనం పైనుంచి తోసేశాడు. మొదట ఆమె ప్రమాదవశాత్తు పడిపోయిందని వారు భావించారు. ఆమె వెన్నెముక, చేతులు, పక్కటెముకలకు తీవ్రమైన పలు విరుగుళ్లతో పాటు, అంతర్గత గాయాలకు కూడా గురైంది.జూన్ 8, 2026న,ఆమె ఆసుపత్రిలో స్పృహలోకి వచ్చి, జరిగిన దారుణాన్ని తన కుటుంబానికి వివరించినప్పుడు అసలు నిజం వెలుగులోకి వచ్చింది.ఈ విషయం తెలుసుకున్న షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రికి వెళ్ళి బాధితురాలిని పరామర్శించారు. తక్షణ సహాయంగా 50,000 అందించారు. ప్రభుత్వ పరంగా సహాయం అందిస్తామని అలాగే నిదితుడి పై కఠిన చర్యలు తీసుకుంటామని బాలికా తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ నాయకులు సంపత్ కుమార్, ఎన్.రాజు,ఎం. ఎన్.రావు తదితరులు పాల్గొన్నారు.

# అండర్ పాస్ వద్ద వాహనదారులకు ఇబ్బంది రాకుండా ప్రత్యేక చర్యలు

**పర్యవేక్షిస్తున్న కొత్తూరు సీఐ నరసయ్య**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** నియోజకవర్గంలోని కొత్తూరు అండర్ పాస్ లో వర్షానికి నీరు నిల్వ లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కొత్తూరు సిఐ నర్సయ్య అన్నారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ,వర్షాకాల దృష్ట్యా వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అండర్పాస్ లో నీరు నిల్వ ఉండకుండా సిబ్బందితో కలిసి శాశ్వత చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు.ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, శాశ్వత బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాకాలంలో నీటి లోతు తెలవక అండర్పాస్ లో వాహనాలు నడపవద్దని ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు నీటితో నిండిన మార్గాలను పూర్తిగా నివారించాలని ప్రజలకు సీఐ నర్సయ్య సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై సత్యశిల్లారెడ్డి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అబార్షన్ కేంద్రంపై పోలీసుల దాడి..

**అనుమతులు లేకుండా ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వహణ.. మహిళల ప్రాణాలతో చెలగాటం**

**డెకాయ్ ఆపరేషన్‌లో వెలుగులోకి అక్రమ కార్యకలాపాలు..**




**నాగోల్,(ప్రజావినికిడి):**
నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జైపూరి కాలనీలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఓ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో అక్రమంగా అబార్షన్లు చేస్తున్న వ్యవహారం పోలీసుల డెకాయ్ ఆపరేషన్‌లో బట్టబయలైంది. మహిళల ఆరోగ్యంతో పాటు వారి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే విధంగా ఎలాంటి వైద్య అర్హతలు, ప్రభుత్వ అనుమతులు లేకుండానే కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.పోలీసుల కథనం ప్రకారం,జైపూరి కాలనీలో రోడ్ నెంబర్-2లో శంకర్ ఇంటికి చెందిన రెండు షట్టర్లను అద్దెకు తీసుకుని బండారు వెంకట లక్ష్మి “కేసరి ఫస్ట్ ఎయిడ్ సెంటర్“ పేరుతో గత కొంతకాలంగా కేంద్రాన్ని నిర్వహిస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు అక్కడ గర్భిణీ మహిళలకు అక్రమంగా అబార్షన్లు నిర్వహిస్తున్నట్లు తెలిసి ఎస్‌వోటీ ఎల్బీనగర్ బృందం,నాగోల్ పోలీసులు సంయుక్తంగా డెకాయ్ ఆపరేషన్ చేపట్టారు.దర్యాప్తులో భాగంగా గర్భిణీ మహిళగా ఓ మహిళా కానిస్టేబుల్‌ను కేంద్రానికి పంపించారు. అక్కడ ఉన్న వీర రేవతి (50) అనే మహిళ ఎలాంటి వైద్య విద్యార్హతలు లేకపోయినా, ప్రభుత్వ అనుమతులు లేకపోయినా అబార్షన్ చేయడానికి ముందుకు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. గర్భిణీలను తనకు పరిచయమున్న స్కానింగ్ సెంటర్లకు పంపించి, స్కానింగ్ నివేదికల ఆధారంగా అబార్షన్‌లు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం.డెకాయ్ ఆపరేషన్‌లో భాగంగా మహిళా కానిస్టేబుల్ వద్ద నుంచి రూ.10 వేల నగదు తీసుకుని, కొన్ని ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం అబార్షన్ చేసేందుకు సిద్ధమవుతుండగాముందస్తు ప్రణాళిక ప్రకారం అక్కడే ఉన్న పోలీసు బృందం జోక్యం చేసుకుని చర్యలు చేపట్టింది. దీంతో అక్రమ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.ఈ సందర్భంగా కేంద్రంలో ఉన్న పలు రికార్డులు, వైద్య సామగ్రి, మందులు,ఇతర ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అక్రమంగా వైద్య సేవలు అందించడం, గర్భస్రావాల నిర్వహణ, సంబంధిత చట్టాల ఉల్లంఘన తదితర అంశాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సమాచారం.
ప్రభుత్వ అనుమతులు పొందిన ఆసుపత్రులు, అర్హత కలిగిన వైద్యుల వద్ద మాత్రమే వైద్య సేవలు పొందాలని, ఇలాంటి అనధికారిక కేంద్రాలను ఆశ్రయించి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు.ఈ ఘటన స్థానికంగా కలకలం రేపగా, అక్రమ వైద్య కేంద్రాలపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇద్దరిని ఆరెస్ట్ చేసి. న్యాయమూర్తి ముందు.హాజరు పరచి నట్లు నాగోల్ ఇన్స్పెక్టర్ మక్బుల్ జానీ తెలిపారు.

# మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణ..



**నాగోల్,(ప్రజావినికిడి):** నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగుడు అపహరించిన ఘటన చోటుచేసుకుంది. సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం.. సాయినగర్ కాలనీ రోడ్ నంబర్-2లో నివాసముంటున్న పాశం శ్యామల (65)శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తుండగా ఉదయం 4 గంటల సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఆమె ఇంటి తలుపు తట్టాడు. నిద్రమత్తులో ఉన్న శ్యామల తలుపు తెరవగానే ఆ వ్యక్తి ఆమె మెడలో ఉన్న సుమారు 3 తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు.భర్త మృతి చెందడంతో శ్యామల కింద అంతస్తులో ఒంటరిగా నివసిస్తుండగా, ఆమె కుమారుడు పై అంతస్తులో ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి డిటేక్టివ్ ఇన్స్పెక్టర్ రుద్విర్ ఆదర్వ శీ లో దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## విద్యుత్ షాక్ తో మరణించిన జేరిపోతుల అజయ్ కుటుంబానికి న్యాయం చేయాలని కోటా కళాశాల ముందు బీఎస్పీ ఆధ్వర్యం లో ఆందోళన






**కరీంనగర్ ప్రతినిధి జూన్ 13 (ప్రజావినికిడి):** విద్యుత్ షాక్ తో మృతి చెందిన జేరిపోతుల అజయ్ కుటుంబానికి న్యాయం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పద్మనగర్ లోని కోటా ప్రయివేట్ విద్యాసంస్థల ముందు ధర్నా నిర్వహించారు కుటుంబ సభ్యుల తో కలిసి ధర్నా చేపట్టారు అక్కడికి టూ టౌన్ సిఐ సృజన్ రెడ్డి వచ్చి ఆందోళన చేస్తున్న పార్టీ నాయకులతో మాట్లాడి బంధువులతో మాట్లాడి ధర్నా ను విరమింపచేశారు. అంతకు ముందు బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం మీడియా తో మాట్లాడుతూ కోటా విద్యా సంస్థల యజమాని లాయిడ్ కంపెనీ యాజమాన్యం లు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా పని చేయించడం వలన వారి సమన్వయ లోపం వలన విద్యుత్ షాక్ తగిలి అజయ్ మరణించినాడని అన్నారు. కళాశాల భవనం కి అనుమతులు ఉన్నాయో లేవో అని ఉంటే రాత్రి కి రాత్రే కళాశాల బోర్డ్ లు ఎందుకు తీసివేసారని రామచంద్రం అన్నారు . జిల్లా లోని కార్మిక శాఖ అధికారులు, సివిల్ ఇంజనీరింగ్ భవన నిర్మాణ అధికారులు విద్యాశాఖ అధికారులు మామూళ్ల మత్తు లో ఉండి నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తున్న వారిపై పర్యవేక్షణ చేయడం లేదని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టరు స్పందిస్తూ సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం నుండి మృతుడి కుటుంబానికి ఒక కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మృతుడి తండ్రి పిర్యాదు మేరకు లాయిడ్ కంపెనీ వారి మీద కోటా విద్య సంస్థల యాజమాన్యం పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఆందోళన లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాతంగి అశోక్ , జోన్ ఇంచార్జ్ కల్లెపెల్లి రాజేందర్ , పార్లమెంట్ ఇంచార్జ్ బోయిని బాబు సిరిసిల్లా అంజయ్య మృతుడి కుటుంబ సభ్యులు బంధువులు పాల్గొన్నారు

## తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

### దర్శనానికి 24గంటల సమయం



**తిరుమల,జూన్ 13,(ప్రజావినికిడి):**వేసవి సెలవులు ముగిస్తుండటంతో శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. తిరుమల గిరులన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వైకుంఠ క్యూ కాంప్లెక్సులు, నారాయణగిరి షెడ్లు పూర్తిగా భక్తులతో నిండాయి. స్వామివారి సర్వదర్శనానికి టోకెన్లు లేని భక్తులకు 24 గంటల సమయం పడుతోంది. ప్రస్తుతం సర్వదర్శన భక్తులను బాట గంగమ్మ ఆలయం నుంచి సర్వదర్శన క్యూలైన్‌లోకి అనుమతిస్తున్నారు. కూలైన్లలో భక్తులకు అల్పాహారం, తాగు నీరు, పాలు వంటివి శ్రీవారి సేవకుల ద్వారా అధికారులు అందజేస్తున్నారు. సీఆర్‌వో వద్ద వసతి గదుల కోసం, కళ్యాణకట్ట కేంద్రాల వద్ద భక్తులు బారులు తీరారు.

## పటాన్‌చెరులో భారీ సైబర్ మోసం

### విశ్రాంత ఉద్యోగిని భయపెట్టి రూ.58.94 లక్షల లూటీ

**సంగారెడ్డి,జూన్ 13, (ప్రజావినికిడి):**

పటాన్‌చెరు శ్రీనగర్ కాలనీకి చెందిన విశ్రాంత ప్రైవేటు ఉద్యోగి మోహన్ రెడ్డి.. సైబర్ నేరగాళ్ల చేతిలో భారీ మోసానికి గురయ్యారు. మనీలాండరింగ్ కేసు పేరుతో భయపెట్టి ఆయన నుంచి మొత్తం రూ.58.94 లక్షలను దశలవారీగా వసూలు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడికి.. ప్రవీణ్ కుమార్, రాజేష్ మిశ్రా అనే ఇద్దరు వ్యక్తులు ఫోన్ చేశారు. జెట్ ఎయిర్‌వేస్ మాజీ చైర్మన్ నరేశ్ గోయల్‌కు సంబంధించిన రూ.538 కోట్ల మనీలాండరింగ్ కేసులో ఆధార్ వివరాలు దుర్వినియోగమయ్యాయని ఆరోపిస్తూ మోహన్ రెడ్డిని బెదిరించారు. ఈ కేసులో మీ పేరుతో కూడా లావాదేవీలు జరిగాయని, దాదాపు రూ.2 కోట్ల ట్రాన్సాక్షన్లు, వాటిపై కమిషన్ తీసుకున్నారని చెప్పి ఆయనను భయభ్రాంతులకు గురిచేశారు. 'మీపై కేసు నమోదైంది, అరెస్ట్ చేయాల్సి ఉంటుంది' అంటూ ఒత్తిడి చేశారు. దీంతో భయపడిన మోహన్ రెడ్డి, దశలవారీగా పలు బ్యాంకు ఖాతాలకు మొత్తం రూ.58.94 లక్షలు బదిలీ చేశారు. అనంతరం ఇది మోసమని గుర్తించిన బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల బ్యాంకు ఖాతాలు, ఫోన్ నంబర్లు, లావాదేవీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. సైబర్ నేరగాళ్లు తరచుగా అధికారులుగా నటిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, ప్రజలు ఇలాంటి కాల్స్‌కు స్పందించవద్దని పోలీసులు సూచించారు.

## అందోల్-జోగిపేటలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం

### కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ జిషాన్ ఆధ్వర్యంలో

**ఆందోల్ ప్రతినిధి జూన్ 13(ప్రజావినికిడి):**

సంగారెడ్డి జిల్లాలోని అసిల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో, అందోల్-జోగిపేట మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ జీషాన్ నాయకత్వంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది.

ఈ వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. సుమారు 165 మంది ప్రజలు ఉచిత వైద్య పరీక్షలు, ఆరోగ్య సలహాలు మరియు వైద్య సేవలను పొందారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అందోల్-జోగిపేట మున్సిపల్ చైర్మన్ శ్రీ కృష్ణారెడ్డి గారు హాజరయ్యారు. అలాగే 16వ వార్డు కౌన్సిలర్ శ్రీ శ్రీను గారు, 18వ వార్డు కౌన్సిలర్ శ్రీ అనిల్ గారు, కో-ఆప్షన్ సభ్యుడు శ్రీ ప్రవీణ్ గారు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తమ సహకారాన్ని అందించారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో




అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజల సంక్షేమం కోసం మరిన్ని ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు, వైద్య బృందం,





నిర్వాహకులు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణకు చేపట్టిన ఈ సేవా కార్యక్రమం స్థానిక ప్రజల ప్రశంసలు అందుకుంది.

## తుని చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసు

### కీలకంగా భావిస్తున్న పెంపుడు కుక్క మృతి

**కాకినాడ,జూన్ 13(ప్రజావినికిడి):**



తుని చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో కీలకంగా భావిస్తున్న పెంపుడు కుక్క అనుమానాస్పదంగా మృతిచెందింది. ఈ ఘటనతో కేసు దర్యాప్తులో కొత్త అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 6వ తేదీన చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యమైన సమయంలో ఆమె వెంట వెళ్లిన పెంపుడు కుక్క కూడా కొంతకాలం కనిపించకుండా పోయింది. మూడు రోజుల తర్వాత కుక్క తిరిగి ఇంటికి వచ్చింది. ఆ తర్వాత నుంచి అది విచిత్రంగా ప్రవర్తించడంతో కుటుంబ సభ్యులు, పోలీసులు దాన్ని పర్యవేక్షణలో ఉంచారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఆ కుక్కకు జీపీఎస్ ట్రాకర్ అమర్చారు. దాని కదలికలను నిన్న ప్రత్యేకంగా పరిశీలించారు. చిన్నారి అదృశ్యం కేసులో ఆ కుక్క కీలక ఆధారాలు ఇవ్వవచ్చని భావించారు. ఈ నేపథ్యంలో డాగ్ ప్రవర్తనపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. అయితే, గత రెండు రోజులుగా కుక్క ఆరోగ్యం క్షీణించడంతో వెటర్నరీ వైద్యులు చికిత్స అందించారు. గతరాత్రి కుక్కకు ఇంజెక్షన్ ఇచ్చిన తర్వాత, ఈరోజు ఉదయం అనారోగ్యంతో మృతిచెందింది. ఈ అనూహ్య ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిన్నారి అదృశ్యం కేసులో పెంపుడు కుక్క మృతి కారణంగా కీలక ఆధారం కోల్పోయినట్లయింది. ఇప్పటివరకు ఆ కుక్క కదలికల ద్వారా కొంత సమాచారం లభించవచ్చని పోలీసులు ఆశించారు. చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చిన్నారిని ఎవరైనా అపహరించారా అనే కోణంలో కూడా విచారణ చేస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్థానికులు, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు ఈ కేసును అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. ఈ ఘటనతో తుని, కాకినాడ ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది.

## సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ

### 335 మంది డిపెండెంట్ కార్మికులకు నియామక పత్రాలు

### కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందిద -డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క వెల్లడి

**మంచిర్యాల,జూన్13(ప్రజావినికిడి):**మంచిర్యాల జిల్లా కేంద్రంలో సింగరేణి డిపెండెంట్ కార్మికుల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం కోలాహలంగా జరిగింది. సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన 335 మంది డిపెండెంట్ కార్మికులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటిదని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కారుణ్య నియామకాల పక్రియను వేగవంతం చేసి, బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన యువత క్రమశిక్షణతో పనిచేసి సింగరేణి పురోభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సింగరేణిని మరింత



లాభాల బాటలో నడిపించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూనే, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతామని హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కార్మిక కుటుంబాల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు విఠల్), స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్యేలు మకాన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణతో పాటు సింగరేణి ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో అక్రమంగా నివసిస్తున్న ఏడుగురు బంగ్లాదేశీయుల అరెస్ట్

**జూన్ 13,(ప్రజావినికిడి):**



హైదరాబాద్‌లో అక్రమ వలసదారులపై పోలీసులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. జీడిమెట్ల ప్రాంతంలో అక్రమంగా నివసిస్తున్న ఏడుగురు బంగ్లాదేశ్ పౌరులను పోలీసులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా పోలీసులు గాజులరామారం హెచ్‌ఏఎల్ కాలనీలోని ఓ అద్దె ఇంటిపై దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్కడ నివసిస్తున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టులు, వీసాలు లేదా ఇతర అవసరమైన పత్రాలు లేకుండా వీరు ఉంటున్నట్లు గుర్తించారు.

తదుపరి న్యాయపరమైన చర్యల కోసం వారిని మెదక్ జిల్లా జోగిపేటలో ఉన్న డిపోర్టేషన్ కేంద్రానికి తరలించినట్లు అధికారులు తెలిపారు. వారి భారత్ ప్రవేశం, నివాసం, ఇతర వివరాలపై లోతైన దర్యాప్తు కొనసాగుతోంది. బెంగాల్ లోని సువేందు అధికారి ప్రభుత్వం అమలు చేస్తున్న 'గుర్తింపుతొలగింపుదేశ బహిష్కరణ' (Identify`Remove`Deport) విధానంలో భాగంగా అక్రమ వలసదారులపై చర్యలు మరింత కఠినతరం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో కూడా అదే తరహా తనిఖీలు జరగడం గమనార్హం.

## శ్రీశైలం అమ్మవారికి భారీ విరాళం

### కోటి విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు అప్పగింత

**నంద్యాల,జూన్ 13, (ప్రజావినికిడి):**


ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి అమ్మవార్లకు భక్తులు భారీ విరాళాన్ని అందజేశారు. కోటి రూపాయలు విలువచేసే బంగారు, వెండి వస్తువులను మల్లన్న



స్వామికి దాతలు సమర్పించారు. కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన శ్రీ లలితా ఎంటర్ ప్రైజెస్ మేనేజింగ్ డైరెక్టర్ మట్టే శ్రీనివాస్ దంపతులు వెండి వస్తువులు, బంగారు అభరణాలను స్వామిఅమ్మవార్లకు సమర్పించినట్లు ఈఓ శ్రీనివాసరావు వెల్లడించారు. బంగారు నామాలు, చంద్రవంక కలిగిన వెండి జటాజూటం, పలు వెండి పూజావస్తువులు, బంగారు రుద్రాక్షమాల, మంగళసూత్రాలను సమర్పించారని ఈఓ తెలిపారు. వెండి వస్తువుల బరువు 42 కేజీల 516 గ్రాములు ఉండగా, బంగారు అభరణాల బరువు 73 గ్రాముల 500 మిల్లీ గ్రాములుగా ఉందని వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్‌లో వీటి విలువ సుమారు కోటి రూపాయల వరకు ఉంటుందని చెప్పారు. బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు ఆలా అనిల్ కుమార్ ఆధ్వర్యంలో దేవస్థానానికి దాతలు అందజేశారు.

# ఎల్‌నినో కార్యాచరణ ఏదీ ?

**జూన్ 13 (రిపబ్లిక్ న్యూస్):**
ఎల్‌నినో హెచ్చరికల నేపథ్యంలో పాలకులు అప్రమత్తం కావాల్సి ఉంది. ముఖ్యంగా సాగు, తాగునీరుతో పాటు, వ్యవసాయ విధానంపై ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం కావాల్సి ఉండగా అలాంటిదేమీ కనిపించడం లేదు. ఇప్పుడు దీని ప్రభావంతో భారతదేశానికి కరువు కాలం కమ్ముకొస్తుంది. దీనిపై ప్రజలను రైతులను అప్రమత్తం చేయడంతో పాటు, కార్యాచరణకు సిద్ధం కావాల్సి ఉంది. నైరుతి రుతు పవనాల రాకతో వర్షాలు పడతాయి.. వ్యవసాయం బాగుంటుందని ఆశిస్తున్న రైతులకు ఇది అశనిపాతం లాంటిదే. ఎల్ నినో వచ్చేసిందని.. ఈ రుతు పవనాల సమయంలో అది మరింత బలపడుతుందని భాతర వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఇదే సమయంలో ఎల్ నినో ప్రారంభం అయినట్లు జపాన్ వాతావరణ సంస్థ జూన్ 11వ తేదీన అధికారికంగా ప్రకటించటం విశేషం. పసిఫిక్ సముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగటాన్ని ఎల్ నినో అంటారు. సముద్ర ఉపరితల జలాల ఉష్ణోగ్రత సహజంగా 3.4 డిగ్రీలుగా ఉంటుంది. ఇప్పుడు అది పాయింట్ 5 శాతం పెరిగింది. అంటే సముద్రం నీరు ఉండాల్సిన వేడి కంటే అధిక వేడిగా ఉన్నాయి. దీన్ని ఎల్‌నినో అంటారు. జూన్ నుంచి ఆగస్ట్ మధ్య కాలంలో ఎల్‌నినో మరింత బలపడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. జూలై మధ్య నుంచి తూర్పు పసిఫిక్ అంతటా విస్తరిస్తుందని.. ఇదంతా రుతు పవనాల కాలంలోనే జరుగుతుందని వాతావరణ శాఖ నివేదిక స్పష్టం చేస్తుంది. సహజంగా నైరుతి రుతు పవనాల సీజన్ లో చల్లటి వాతావరణంతోపాటు నికరంగా వర్షాలు పడతాయి. ఎల్‌నినో ప్రభావంతో సముద్రం నీరు వేడెక్కటం వల్ల సముద్రం నుంచి భూమిపైకి వేడి గాలులు వీస్తాయి. భూమిపై ఎక్కువగా పొడి వాతావరణం ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వర్షపాతం తక్కువగా ఉంటుంది. దీంతో కరువు వస్తుంది. దీనికితోడు అక్కడక్కడ కుండపోత వర్షాలు ఉంటాయి. క్లౌడ్ బరస్టులు ఉంటాయి. దీని వల్ల విపత్తులు వచ్చే ప్రమాదం ఉంది. వర్షాలు తక్కువగా ఉండటం వల్ల నీళ్ల కొరత ఏర్పడుతుంది. మంచి నీళ్లకు.. సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయి. వ్యవసాయానికి అవసరం అయిన నీళ్లు లేక పంటలు పండవు. ఆదాయం లేక రైతులు, రైతు కూలీలకు



ఇబ్బంది వస్తుంది. ఎల్‌నినో అధికారంగా ప్రారంభం అయిన భారత వాతావరణ శాఖ ప్రకటనతో ప్రభుత్వాలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. రైతులు పంటలు సాగు చేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అన్నింటికి మించి పంటలకు సంబంధించి ఆరుతడి పంటలకు రైతులను ప్రోత్సాహించాలి. సాగునీటి లభ్యత తక్కువగా ఉంటుంది కాబట్టి, వరి లాంటి పంటలకు రైతులు దూరంగా ఉండాలి. మనకున్న వనరులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా కార్యాచరణ సిద్ధం చేయాలి. ఎల్‌నినోకు కారణం ఓ రకంగా చెప్పాలంటే పర్యావరణ విధ్వంసమే. మన చేజేతులా పర్యావరణ విధ్వంసానికి పాల్పడిన పాపానికి విపరీత వాతావరణ పరిస్థితులు ఎదుర్కోబోతున్నాం. వాతావరణ మార్పు, పర్యావరణ వ్యవస్థ నష్టం, భూమి ఎడారీకరణ వంటి తీవ్రమైన పరిణామాలతో మానవ-ప్రేరిత పర్యావరణ నష్టం పెరుగుతుంది. పర్యావరణాన్ని పరిరక్షించడం, భూమి మరియు ప్రకృతిని వాటి సహజ స్థితికి పునరుద్ధరించడం ఇప్పుడు అంరి తక్షణ కర్తవ్యం కావాలి. భూమిని రక్షించడానికి, పునరుద్ధరించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. పర్యావరణ విధ్వంసం నిరంతరంగా సాగడంవ వల్ల మన భూమి భవిష్యత్తు ప్రమాదంలో పడింది. ఎడారీకరణ, భూమి క్షీణత, కరువు అనేది మన కాలంలోని అత్యంత ముఖ్యమైన పర్యావరణ సవాళ్లలో ఒకటి. ఇటీవలే జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నాం. అయినా మనలో మార్పు కానరావడం లేదు. చెరువులను మింగేస్తున్నాం. ప్లాస్టిక్ భూతాన్ని భూమిపైకి వదిలేస్తున్నాం. మన పర్యావరణాన్ని రక్షించడానికి

ప్రపంచవ్యాప్త అవగాహన, కార్యాచరణను ప్రోత్సహించడానికి మాటలతో సరిపెడుతున్నాం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పర్యావరణంపై దృష్టి సారించి, ఏటా చర్యలు తీసుకుని ఉంటే ఇలాంటి ఎల్‌నినో ప్రభఆవాలు వచ్చే వచ్చేవి కావు. ఇప్పటికైనా మనమంతా భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తి, పద్ధతులపై దృష్టి సారించాలి. మన భవిష్యత్తు, మన తరం, భూమి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు ఆ వైపు కార్యాచరణను రూపొందించి కచ్చితంగా అమలు చేయాలి. పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు, సైన్సు సంస్థలు ఎల్‌నినో దుష్ఫలితాలపై విస్తృతంగా ప్రచారంనిర్వహించాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి. ముఖ్యంగా యువతను ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలి. ద ఈ నిని ప్రజా ఉద్యమంగా దిశా నిర్దేశం చేయాలి. అన్ని పర్యావరణ పరిరక్షణ సంస్థలు, వ్యక్తులు ఒక ఉద్యమంలా ఐక్యంగా పనిచేయడం ద్వారా ధరిత్రిని కాపాడుకోవాలి. ఈ క్రమంలో తక్షణంగా ప్రస్తుత విపత్తును తట్టుకునే కార్యాచరణకు రంగం సిద్ధం చేయాలి. కేంద్రం తక్షణమే రాష్ట్రాలతో సంప్రతింపులు జరిపి వ్యయసాయ స ంక్షోభ నివారణకు చర్యలు తీసుకోవాలి. తాగునీటి సమస్యపైనా చర్చించాలి.

# విజయ్ కుటుంబంలో అనూహ్య పరిణామం

**భార్య సంగీతను మళ్లీ కుటుంబంలోకి తీసుకు వచ్చే యత్నం -రంగంలోకి దిగిన విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్**

**చెన్నై, జూన్ 13 (రిపబ్లిక్ న్యూస్):**
తమిళనాడు సీఎం విజయ్ జోసెఫ్ సంసారం చక్కదిద్దే పనిలో ఆయన తల్లి శోభ రంగంలోకి దిగినట్లు సమాచారం. సిఎం కావడంతో విజయ్ ప్రస్తుతం ప్రజాసేవలో మునిగిపోయారు. పదవి చేపట్టిన దగ్గరనుంచి ఆయన ప్రజలకు మంచి చేయాలని చూస్తున్న వేళ క్షణం తీరికి లేకుండా ఉన్నారు. ఇంకోపక్క ఇండస్ట్రీకి కూడా దగ్గరగానే ఉంటున్నారు. ఇక ఇదంతా పక్కన పెడితే.. విజయ్ వ్యక్తిగత విషయం ఒకటి సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. గత కొంతకాలంగా విజయ్, ఆయన భార్య సంగీత విడివిడిగా ఉంటున్న విషయం తెల్సిందే. ఎన్నికల సమయంలో విజయ్ భార్య సంగీత.. తన భర్త నటి త్రిషతో రిలేషన్ లో ఉన్నారని, తనను, తన పిల్లలను ఆయన మోసం చేశారని, తనకు విడాకులు ఇప్పించాలాని కోర్టులో కేసు వేశారు. విజయ్ సీఎం అయ్యినప్పుడు కానీ, ప్రమాణ స్వీకారం అప్పుడు కానీ.. సంగీత, పిల్లలు ఆయన పక్కన లేరు. దీంతో వీరిమధ్య దూరం బాగా పెరిగిందని, సంగీత ఇక




లండన్ నుంచి రాదనుకున్నారు. త్వరలోనే విజయ్.. త్రిషను పెళ్ళి చేసుకుంటున్నట్లు కూడా వార్తలు వినిపించాయి. ఇక తాజాగా ఇండస్ట్రీ మొత్తానికి షాక్ ఇచ్చినట్లు విజయ్ - సంగీత కలిసిపోయారని సమాచారం. వీరిద్దరి మధ్య ఉన్న మనస్పర్థలను పరిష్కరించి, ఈ జంటను తిరిగి ఒకటి చేయడానికి కుటుంబ సభ్యులు తెరవెనుక గట్టి ప్రయత్నాలే చేసినట్లు తెలుస్తోంది. కొడుకు- కోడలిని కలపడానికి విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్ అత్యంత కీలక పాత్ర పోషించారని తెలుస్తోంది. కొడుకు రాజకీయ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, అలాగే కుటుంబ బంధాలను కాపాడుకోవడానికి శోభ స్వయంగా కోడలు సంగీతతో మాట్లాడి, ఇరుపక్షాల మధ్య ఉన్న విభేదాలను పరిష్కారం అయ్యేలా చేసినట్లు సమాచారం. తల్లి చేసిన ఈ గట్టి ప్రయత్నాల వల్లనే విజయ్ - సంగీత మళ్లీ కలిసి ఒకే ఇంట్లో ఉండటానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు చెన్నై వర్గాల సమాచారం. విజయ్ త్వరలోనే పూర్తిస్థాయి రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్న తరుణంలో.. భార్య సంగీత మళ్లీ ఆయన పక్కన చేరడం పొలిటికల్‌గా కూడా విజయ్‌కు చాలా ప్లస్ అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇంకోపక్క విజయ్ కొడుకు జేసన్ సంజయ్ కి కూడా ఇప్పుడు తండ్రి సపోర్ట్ చాలా అవసరం. అందుకే సంగీత కూడా భర్తతో ఉండడానికి ఒప్పుకొన్నారని అంటున్నారు. ప్రేమ, పెళ్ళి అంటూ విజయ్ వెనుక తిరిగిన త్రిషకు ఇప్పటివరకు ఒరిగింది ఏం లేదు. అలాంటప్పుడు విజయ్ - సంగీత కలిసిపోతే త్రిష సైలెంట్ గా ఉంటుందా.. అన్న చర్చ కూడా సాగుతోంది.

# చంద్రబాబు, లోకేష్ వీడియోలతో దోచేసిన సైబర్ నేరగాళ్లు

**ఏఐతో దోపిడీలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు**
**డీప్‌ఫేక్ వీడియోల ద్వారా రూ. 80 వేలు దోచేసిన వైనం**
**సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వైజాగ్ వ్యక్తి**

**జూన్ 13 (రిపబ్లిక్ న్యూస్):**
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత ఎంతలా అభివృద్ధి చెందుతోందో తెలిసిందే. దానిని అడ్డం పెట్టుకుని సైబర్ నేరగాళ్లు ప్రమాదకరమైన మోసాలకు తెరలేపుతున్నారు. ఏకంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ల 'డీప్‌ఫేక్' వీడియో కాల్స్‌ను సృష్టించి విశాఖపట్నానికి చెందిన ఒక సామాన్య వ్యక్తిని రూ. 80 వేలకు ముంచేసిన షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది.సాంకేతికతను వాడుకుని కేటుగాళ్లు ఎంత పక్కాగా స్కెచ్ వేశారో ఈ వివరాలు చూస్తే అర్థమవుతుంది. విశాఖపట్నం సీతంపేటకు చెందిన శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తికి ఒక భూమి సమస్య ఉంది. దానిని పరిష్కరించాలంటూ ఆయన మంత్రి నారా లోకేష్‌ను ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. దీనిని గమనించిన సైబర్ దొంగలు మరుసటి రోజే వాట్సాప్ ద్వారా శ్రీనివాస్ రెడ్డిని



కాంటాక్ట్ చేశారు. నమ్మకం కుదర్చడం కోసం మాజీ మంత్రి దేవినేని ఉమా ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకున్నారు. మీ సమస్య సీఎంఓ దాకా వెళ్లిందని, త్వరలోనే పరిష్కారమవుతుందని నమ్మబలికారు.
బాధితుడికి ఇంకాస్త గట్టి నమ్మకం కలిగించడం కోసం నేరగాళ్లు ఏఐ (ఏఐ) టెక్నాలజీని ఉపయోగించి ఒక వీడియో కాల్ చేశారు. ఆ కాల్‌లో సాక్షాత్తూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కూర్చుని, తన సమస్యను పరిష్కరిస్తామని స్వయంగా హామీ ఇస్తున్నట్లు ఆ వీడియోను మార్ఫింగ్ చేశారు. ఆ వీడియో కాల్ చూసిన శ్రీనివాస్ రెడ్డి... నిజంగానే ముఖ్యమంత్రే తనతో మాట్లాడుతున్నారని నమ్మి మైమరచిపోయారు.ఆ తర్వాత అసలు రంగు బయటపెట్టిన కేటుగాళ్లు.. ఈ ల్యాండ్ ఇష్యూ కాస్త కాంప్లికేటెడ్‌గా ఉందని, దీనిని సెటిల్ చేయాలంటే కొంత ఖర్చవుతుందని నమ్మబలికారు. బాధితుడి నుంచి విడతల వారీగా దాదాపు 80 వేల రూపాయలను ఆన్‌లైన్ ద్వారా గుంజేశారు. డబ్బులు పంపిన తర్వాత అవతలి వైపు నుంచి ఎలాంటి రెస్పాన్స్ లేకపోవడంతో, తాను దారుణంగా మోసపోయానని గ్రహించిన శ్రీనివాస్ రెడ్డి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.పోలీసులు కేసు నమోదు చేసి ఈ హైటెక్ మోసంపై దర్యాప్తు ప్రారంభించారు. టెక్నాలజీ పెరిగేకొద్దీ నేరాల శైలి కూడా ఎలా మారుతోందో చెప్పడానికి ఈ ఘటనే ఒక ఉదాహరణ. సోషల్ మీడియాలో మీ వ్యక్తిగత సమస్యలను, ఫోన్ నంబర్లను పెట్టేటప్పుడు.. అలాగే గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్ విషయంలో ఎంత జాగ్రత్తగా ఉండాలో ఈ ఘటన హెచ్చరిస్తోంది.

# సిరిసిల్ల మనబడి-మనబాధ్యతలో బండి

**ఎస్పీ హాజరు కాకపోవడంపై మంత్రి ఆగ్రహం**

**రాజన్న సిరిసిల్ల,జూన్13:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి. గీతేపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్లలోని కుసుమ రామయ్య ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన 'మన బడి-మన బాధ్యత' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ మహేశ్ బి. గీతే హాజరు కాకపోవడంపై బండి సంజయ్ అసంతృప్తి వ్యక్తం చేశారు.



ఈ కార్యక్రమంలో డీఎస్పీ మాత్రమే ఉండటంతో.. 'ఎస్పీ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. తాను సాధారణ కార్యకర్తను కాదని, కేంద్రమంత్రిగా పాల్గొంటున్న కార్యక్రమానికి జిల్లా పోలీసు అధికారి హాజరు కావాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీని ఉద్దేశించి మాట్లాడుతూ.. 'మీ ఎస్పీకి బీఆర్ఎస్‌పై అంత ప్రేమ ఎందుకని ప్రశ్నించారు. అవసరమైతే బీఆర్ఎస్‌లో చేరాలని వ్యంగ్యంగా అన్నారు. అధికార యంత్రాంగం రాజకీయ పక్షపాతం లేకుండా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారులు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని బండి సంజయ్ ఆదేశించారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

---------------

# సింగరేణిలో బొగ్గు మాయంపై విచారణ

**సిఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి లేఖ**

**హైదరాబాద్,జూన్13:** సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. సింగరేణిలో అవకతవకలు జరిగాయంటూ వచ్చిన వార్తలపై ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి నుంచి దాదాపు రూ.1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలి. భద్రతను కఠినతరం చేయాలి. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి రూ.51,500 కోట్లకు పైగా బకాయి పడి ఉంది. దీంతో సంస్థపై ఆర్థిక ఒత్తిడి నెలకొంది. సంస్థలో సేఫ్‌గార్డ్స్, ఇంటర్నల్ కంట్రోల్ సిస్టమ్ పనితీరును సమీక్షించాలి. సింగరేణి సామర్థ్యం, పారదర్శకత, విశ్వసనీయతను బలోపేతం చేయాలని లేఖలో పేర్కొన్నారు. 40 వేల మందికి పైగా ఉన్న సింగరేణి కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమంతోపాటు సంస్థ భవిష్యత్తును కాపాడటం మన అందరి బాధ్యత అని చెప్పారు.

# అసలు ఓట్లు తొలగించే కుట్ర: కెటిఆర్

**రాజన్న సిరిసిల్ల,జూన్13:** తెలంగాణలో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. 'సర్' ప్రక్రియను బీఆర్ఎస్ సీరియస్‌గా తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈరోజు (శనివారం) రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో కేటీఆర్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్‌లాగా దొంగ ఓట్లతో గెలవాలని తాము అనుకోమని కేటీఆర్ తేల్చిచెప్పారు. రైతుభరోసా వేయకుండా రేవంత్‌రెడ్డి సర్కార్ రైతన్నలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. 420 హామీలు ఇచ్చి ప్రజలను బురిడీ కొట్టించారని ఎద్దేవా చేశారు. 'సర్' పేరుతో దొంగ ఓట్లతో అసలైన ఓట్లను తొలగిస్తే చూస్తూ ఊరుకోమని మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు.

# రైతుల సంక్షేమం లక్ష్యంగా కృషి

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**నల్గొండ,జూన్13:** రైతన్నల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు. రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుందని... గ్రామం బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని పేర్కొన్నారు. శనివారం నల్గొండలో రాష్ట్ర సిట్రస్ సెమినార్ -2026ను రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితో కలసి మంత్రి కోమటిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. నల్గొండ జిల్లా పేరు చెప్పగానే బత్తాయి తోటలు గుర్తుకు వస్తాయని మంత్రి కోమటిరెడ్డి ప్రస్తావించారు. గత నాలుగు దశాబ్దాలుగా వేలాదిమంది రైతుల జీవనాధారంగా బత్తాయి సాగు చేస్తున్నారని తెలిపారు. తాను రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని చెప్పుకొచ్చారు. గతంలో స్వయంగా బత్తాయి సాగు చేసిన అనుభవం తనకు ఉందని వివరించారు. గత సంవత్సరం వరకు బత్తాయి రైతులకు ప్రత్యేకంగా ఓ వేదిక లేకపోవడం లోటుగా ఉండేదని అన్నారు. పుస్తకాల్లో ఉండే శాస్త్రీయ జ్ఞానం రైతుల పొలాల వరకు చేరినప్పుడే వ్యవసాయ రంగంలో నిజమైన మార్పు వస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

# ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు

**పార్కుల ద్వారా వేలాదిమందికి ఉద్యోగాలు**

**మంత్రి టీజీ భరత్ గుప్తా వ్యాఖ్య**




**కర్నూలు,జూన్13:** ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని ఏపీ మంత్రి టీజీ భరత్ గుప్తా వ్యాఖ్యానించారు. ఈ పార్కుల ద్వారా వేలాదిమందికి ఉద్యోగాలు దక్కుతాయని పేర్కొన్నారు. ఈరోజు(శనివారం) మంత్రి భరత్ కర్నూల్‌లో పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 19 కంపెనీల్లో 1460 ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహించామని తెలిపారు. ఒక్కరికి ఉద్యోగం వస్తే ఆ కుటుంబం అంతా సంతోషంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్‌మేళా నిర్వహిస్తామని మంత్రి భరత్ వివరించారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో ఉద్యోగాలు సృష్టించేందుకు కష్టపడుతున్నామని చెప్పుకొచ్చారు. ఓర్వకల్లుకు గతంలో ఎప్పుడు లేనంతగా కంపెనీలను తీసుకువస్తున్నామని తెలిపారు. రిలయన్స్, అగస్త్య కంపెనీలను కర్నూలుకు తీసుకువచ్చామని ప్రస్తావించారు. జైరాజ్ ఇస్పాత్ స్టీల్ కంపెనీ మరో రూ.6 వేల కోట్ల పెట్టుబడిని పెడుతోందని వెల్లడించారు. సీఎం చంద్రబాబు ఆలోచనలు అమలైతే ప్రపంచంలోనే ఏపీ మొదటి స్థానంలో ఉంటుందని ఉద్ఘాటించారు. ఇప్పటికే దేశంలోకి వచ్చే 25 శాతం పెట్టుబడులు ఏపీకి వస్తున్నాయని మంత్రి భరత్ పేర్కొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# కొత్త రికార్డు సృష్టించిన రోహిత్ శర్మ



టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ భారత వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యంత అరుదైన మైలురాయిని అధిగమించి సరికొత్త రికార్డు సృష్టించాడు. అఫ్ఘానిస్థాన్‌తో ధర్మశాలలో జరుగుతున్న తొలి వన్డేలో బరిలోకి దిగడం ద్వారా.. భారతదేశం తరపున అత్యధిక వయసులో వన్డే మ్యాచ్ ఆడిన క్రికెటర్‌గా రోహిత్ నిలిచాడు. ఈ క్రమంలో 39 ఏళ్ల 44 రోజుల వయసున్న రోహిత్.. 1989 నాటి మొహిందర్ అమర్‌నాథ్ (39 ఏళ్ల 36 రోజులు) ఆల్‌టైమ్ రికార్డును బద్దలు కొట్టాడు. టీమిండియా స్టార్ బ్యాటర్, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అరుదైన రికార్డు సాధించాడు. టీమిండియా తరపున వన్డే మ్యాచ్ ఆడిన అత్యధిక వయస్కుడిగా రికార్డు క్రియేట్ చేశాడు. అఫ్ఘానిస్థాన్‌తో ధర్మశాల వేదికగా జరుగుతున్న తొలి వన్డేలో బరిలోకి దిగిన రోహిత్ శర్మ.. భారత క్రికెట్ చరిత్రలో అత్యధిక వయసులో వన్డే మ్యాచ్ ఆడిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఈ క్రమంలోనే మోహిందర్ అమర్‌నాథ్‌ను అధిగమించాడు. గతంలో ఈ రికార్డు టీమిండియా మాజీ ప్లేయర్, 1983 వన్డే ప్రపంచకప్ విజేత జట్టు సభ్యుడు మొహిందర్ అమర్‌నాథ్ పేరిట ఉంది. ఆయన 39 ఏళ్ల 36 రోజుల వయసులో 1989లో తన కెరీర్‌లో చివరి వన్డే మ్యాచ్ ఆడారు. తాజాగా ఈ రికార్డును హిట్‌మ్యాన్ అధిగమించాడు. అఫ్ఘానిస్థాన్‌తో ధర్మశాలలో జరుగుతున్న తొలి వన్డేలో రోహిత్.. 39 ఏళ్ల 44 రోజుల వయస్సుతో బరిలోకి దిగాడు. 2007లో టీమిండియా తరపున తొలి మ్యాచ్ ఆడిన రోహిత్.. 19 ఏళ్లుగా జట్టులో కొనసాగుతున్నాడు. 2007లో రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్ అరంగేట్రం చేశాడు. కెరీర్‌లో తొలి నాలుగైదేళ్లు తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొన్నాడు. టీ20 ప్రపంచకప్ 2007 విన్నింగ్ టీమ్‌లో సభ్యుడిగా ఉన్న అతడు.. ఆ తర్వాత అవకాశాలు కోల్పోయాడు. ముఖ్యంగా వన్డే ప్రపంచకప్ 2011లో జట్టులో చోటు దక్కించుకోలేక నిరాశకు లోనయ్యాడు. ఈ సమయంలో ధోనీ నిర్ణయం రోహిత్ కెరీర్‌ను మలుపుతిప్పింది. అప్పటివరకూ మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు వచ్చే.. హిట్‌మ్యాన్‌ను.. ధోనీ ఓపెనర్‌గా బరిలోకి దించాడు. ఇక అప్పటి నుంచి అతడు వెనక్కి తిరిగి చూసుకోలేదు. కీలక ఆటగాడిగా మారడంతో పాటు.. టీమిండియా మేటి కెప్టెన్‌లలో ఒకడిగా రికార్డు క్రియేట్ చేశాడు. వన్డే ప్రపంచకప్ 2023 భారత్ రన్నరప్‌తో సరిపెట్టుకున్నా రోహిత్ మాత్రం తన నాయకత్వ లక్షణాలతో అదరగొట్టాడు. తన సారథ్యంలో టీమిండియాకు టీ20 ప్రపంచకప్ 2024 టైటిల్ అందించాడు. టీ20, టెస్టులకు గుడ్‌బై చెప్పిన రోహిత్ శర్మ.. ప్రస్తుతం కేవలం వన్డేల్లో మాత్రమే ఆడుతున్నాడు. వన్డే ప్రపంచకప్ 2027లో ఆడటమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాడు. వన్డే ప్రపంచకప్ టైటిల్ కల నెరవేరాలంటే రోహిత్ శర్మకు.. వచ్చే 18 నెలలు కీలకం కానుంది.

# టీమిండియా తరపున డెబ్యూ చేసిన హర్ష్ దూబె , గుర్నూర్ బ్రార్



భారత్, అఫ్ఘానిస్థాన్ మధ్య ధర్మశాల వేదికగా జరగాల్సిన తొలి వన్డే ఎట్టకేలకు ప్రారంభమైంది. వర్షం కారణంగా టాస్ ఆలస్యం కావడంతో మ్యాచ్‌ను ఇరు జట్లకు 25 ఓవర్ల చొప్పున కుదించారు. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. ఈ మ్యాచ్ ద్వారా టీమిండియా తరఫున హర్ష్ దూబె, గుర్నూర్ బ్రార్ వన్డేల్లోకి అరంగేట్రం చేయగా.. గాయం తర్వాత రోహిత్ శర్మ రీఎంట్రీ ఇస్తున్నాడు. భారత్, అఫ్ఘానిస్థాన్ జట్ల మధ్య తొలి వన్డే మ్యాచ్ ఎట్టకేలకు ప్రారంభమైంది. నిజానికి ధర్మశాల వేదికగా మధ్యాహ్నం 1.30 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కావాల్సింది. కానీ వర్షం అంతరాయం కలిగించడంతో టాస్ ఆలస్యమైంది. చివరకు వరుణుడు కరుణించడంతో అంపైర్లు టాస్ వేశారు. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. వర్షం కారణంగా మ్యాచ్‌ను 25 ఓవర్ల చొప్పున కుదించారు. ఈ మ్యాచ్‌లో టీమిండియా తరఫున ఇద్దరు ప్లేయర్లు డెబ్యూ చేశారు. ఐపీఎల్‌లో సత్తాచాటిన హర్ష్ దూబె , గుర్నూర్ బ్రార్.. భారత జట్టు తరపున తొలి మ్యాచ్ ఆడుతున్నారు. హర్ష్ దూబె ఐపీఎల్ 2026లో సన్ రైజర్స్ తరపున ఆడాడు. 8 మ్యాచులలో 8 వికెట్లు తీశాడు. యశస్వి జైశ్వాల్, ప్రిన్స్ యాదవ్, కుల్‌దీప్ యాదవ్‌కు తుది జట్టులో చోటు దక్కలేదు. రోహిత్ శర్మతో కలిసి శుభ్‌మన్ గిల్ ఇన్నింగ్స్ ప్రారంభించనుండగా.. విరాట్ కోహ్లీ 3వ స్థానంలో ఇషాన్ కిషన్ బ్యాటింగ్‌కు దిగనున్నాడు. మరోవైపు తాము టాస్ గెలిచినా.. తొలుత బౌలింగ్ ఎంచుకునే వాళ్లమని అఫ్ఘానిస్థాన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిదీ చెప్పాడు. ఇద్దరు పేసర్లు, ఒక ఆల్‌రౌండర్, ముగ్గురు స్పిన్నర్లతో తాము బరిలోకి దిగుతున్నట్లు వెల్లడించాడు. కాగా గాయం కారణంగా ఐపీఎల్ 2026లో కొన్ని మ్యాచ్‌లకు దూరమైన రోహిత్ శర్మ.. ఈ సిరీస్‌తో రీఎంట్రీ ఇస్తున్నాడు. దీంతో అతడు ఎలాంటి ప్రదర్శన చేస్తాడనేది ఆసక్తికరంగా మారింది. ఈ సిరీస్‌లో ఆడితేనే అతడు వన్డే ప్రపంచకప్ 2027 రేసులో ఉండే అవకాశం ఉంది. తుది జట్లు ఇవే..టీమిండియా: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డి, హర్ష్ దూబె, గుర్నూర్ బ్రార్ , అర్షదీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణఅఫ్ఘానిస్థాన్: ఇబ్రహీం జద్రాన్, రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), సెదికుల్లా అటల్, రెహ్మత్ షా, హష్మతుల్లా షాహిది (కెప్టెన్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్, మహమ్మద్ నబీ, రషీద్ ఖాన్, మహమ్మద్ సలీమ్ సఫీ, ఘజన్‌ఫర్, జియా ఉర్ రెహ్మాన్ షరీఫ్

# యశస్వి జైస్వాల్ ఆల్‌ఫార్మాట్ ప్లేయర్

- యశస్వికి వన్డేల్లో అవకాశం కల్పించాలి
- మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్



టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌పై మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ ప్రశంసల జల్లు కురిపించాడు. యశస్వి జైస్వాల్ ఆల్‌ఫార్మాట్ ప్లేయర్ అని, అతనికి వన్డేల్లో అవకాశం కల్పించాలని సూచించాడు. వైట్‌బాల్ క్రికెట్ ఆడే సామర్థ్యం యశస్వి జైస్వాల్‌కు ఉందని, కానీ జట్టులో చోటు లేదని తెలిపాడు. టెస్ట్ ఫార్మాట్‌లో రెగ్యులర్ ఓపెనర్‌గా కొనసాగుతున్న యశస్వి జైస్వాల్‌కు వన్డే ఫార్మాట్‌లో మాత్రం అవకాశం దక్కడం లేదు. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఓపెనర్‌గా బరిలోకి దిగుతుండటంతో యశస్వికి వన్డే టీమ్‌లో చోటు లేకుండా పోయింది. ఒకవేళ వచ్చినా ఎక్కువగా బెంచ్‌కే పరిమితం కావాల్సి వస్తోంది. తాజాగా విరాట్ కోహ్లీ గాయంతో యశస్వి జైస్వాల్‌కు అఫ్గాన్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడే అవకాశం వచ్చింది. కానీ తుది జట్టులో అవకాశం దక్కుతుందా అంటే అవునని చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే వీరేంద్ర సెహ్వాగ్.. భవిష్యత్తులో యశస్వి జైస్వాల్ మూడు ఫార్మాట్లలో ఆడుతాడని జోస్యం చెప్పాడు. 'యశస్వి జైస్వాల్ ఇప్పటివరకు కేవలం నాలుగు వన్డేలు మాత్రమే ఆడాడు. అందులో ఒక సెంచరీ నమోదు చేశాడు. కానీ తర్వాత అతనికి అవకాశాలు రాలేదు. ఎందుకంటే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఓపెనర్‌గా బరిలోకి దిగుతున్నాడు. రోహిత్ శర్మ ఇంకా వన్డేల్లోనూ కొనసాగుతున్నాడు. దాంతో ఓపెనర్ స్లాట్ ఖాళీగా లేదు. త్వరలోనే రోహిత్ వన్డేలకు వీడ్కోలు పలికే అవకాశం ఉంది. అప్పుడు యశస్వి జైస్వాల్‌కు ఓపెనర్‌గా అవకాశం దక్కుతుంది. అయితే అతనికి రుతురాజ్ గైక్వాడ్ నుంచి పోటీ తప్పదు. జట్టులోకి ముగ్గురు ఓపెనర్లను తీసుకుంటే మాత్రం యశస్వి జైస్వాల్ తప్పకుండా ఉంటాడు.

# కేన్ రిటైర్మెంట్‌పై కోహ్లీ ఎమోషనల్ పోస్ట్



న్యూజిలాండ్ దిగ్గజ బ్యాటర్ కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు హఠాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో, టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. అండర్-19 రోజుల నుంచి తమ మధ్య ఉన్న ప్రత్యర్థిత్వం కాలక్రమేణా గొప్ప స్నేహంగా ఎలా మారిందో కోహ్లీ గుర్తుచేసుకున్నాడు. మైదానంలోనే కాకుండా వ్యక్తిగత జీవితంపై ఇద్దరూ పంచుకున్న ఆలోచనలు ఎప్పటికీ ప్రత్యేక జ్ఞాపకాలుగా ఉంటాయని పేర్కొన్నాడు. నీ జీవితం ఇప్పుడే మొదలైంది మిత్రమా అంటూ కేన్‌కు శుభాకాంక్షలు తెలిపాడు. ప్రపంచ క్రికెట్‌లో ఫ్యాబ్-4లో ఒకడిగా పేరు పొందిన న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ కేన్ విలియమ్సన్ అనూహ్యంగా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఓ పక్క ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్ కోసం ఇంగ్లీష్ గడ్డపై పర్యటనలో ఉన్న కేన్.. అనూహ్యంగా ఆటకు వీడ్కోలు పలికాడు. రెండో టెస్టు ప్రారంభానికి ముందు అతడు ఈ నిర్ణయం తీసుకున్నాడు. దీంతో క్రికెట్ ప్రపంచాన్ని ఒక్కసారిగా ఆశ్చర్యపరిచాడు. అయితే ఈ నిర్ణయంపై టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ స్పందించాడు. రిటైర్మెంట్ ప్రకటన తర్వాత కేన్ విలియమ్సన్‌కు శుభాకాంక్షలు చెబుతూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టాడు. అతడితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యాడు. "ప్రత్యర్థులుగా ప్రారంభమైన మన ప్రయాణం.. కాలక్రమేణా స్నేహంగా మారింది. ఎన్నో ఏళ్లుగా నీ ఆటను చూస్తూ.. నీతో పోటీ పడటం గొప్ప అనుభవంగా భావిస్తున్నా. అంతకంటే ఎక్కువగా క్రికెట్‌తో పాటు వ్యక్తిగత జీవితంపై మనం పంచుకున్న ఆలోచనలు విలువైనవిగా అనిపిస్తాయి. మనమిద్దరం కలిసి మాట్లాడుకున్న క్షణాలు నాకు ప్రత్యేక జ్ఞాపకంగా నిలుస్తాయి. నీ జీవితంలో అంతా మంచే జరగాలని కోరుకుంటున్నా. క్రికెట్ కోసం నీ సర్వస్వాన్ని ధారపోశావు. ఇప్పుడు ఆ విజయాలను ఆస్వాదించే సమయం వచ్చింది. నీ జీవితం ఇప్పుడే మొదలైంది మిత్రమా" అని విరాట్ కోహ్లీ సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడు. కాగా విరాట్ కోహ్లీ, కేన్ విలియమ్సన్ మధ్య చక్కటి అనుబంధం ఉంది. అండర్-19 ప్రపంచకప్‌లో వీరిద్దరూ ఒకేసారి వారి వారి అంతర్జాతీయ జట్ల తరపున ఆడారు. పోటీపడి మరీ పరుగులు సాధించారు. క్లాస్ ఆటతో ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఏర్పరచుకున్న వీరిద్దరూ.. ఫ్యాబ్ 4లో ఆస్ట్రేలియా స్టార్ స్టీవ్ స్మిత్, ఇంగ్లాండ్‌కు చెందిన జో రూట్‌తో పాటు చోటు సాధించారు. అయితే వీరిలో అందరికంటే ముందే కేన్ విలియమ్సన్.. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. కేన్ విలియమ్సన్ తన కెరీర్‌లో 110 టెస్టులాడి 9,515 పరుగులు, 175 వన్డేల్లో 7,256 పరుగులు, 93 టీ20ల్లో 2,575 పరుగులు పరుగులు చేశాడు. 40 టెస్టులు, 91 వన్డేలు, 75 టీ20ల్లో న్యూజిలాండ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు.

# సెమీఫైనల్‌లో సింధుకు ఓటమి

## యమగుచి చేతిలో పరాజయం

## టోర్నమెంట్ నుంచి నిష్క్రమణ

భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. 2026 ఆస్ట్రేలియా ఓపెన్ సెమీఫైనల్ మ్యాచ్‌లో ఓడిపోయింది. శనివారం జరిగిన సెమీస్‌లో జపాన్ క్రీడాకారిణి అకానె యమగుచిని ఢీకొట్టిన సింధు 22-20, 21-12 తేడాతో ఓడిపోయి టోర్నమెంట్ నుంచి నిష్క్రమించింది. దీంతో 2026లో తొలి టైటిల్ కోసం సింధు ఎదురుచూపులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో తొలి సెట్ హోరాహోరీగానే సాగింది. యమగుచికి సింధు అద్భుతంగా బదులిచ్చింది. బ్రేక్ టైమ్ దాకా సింధునే ఆధిక్యంలో ఉంది. అయితే విరామం తర్వాత యమగుచి పుంజుకుంది. వరుసగా ఆరు పాయింట్లు గెలుచుకుని మ్యాచ్‌పై పట్టు సాధించింది. సింధు కూడా తిరిగి పుంజుకుని మళ్లీ లీడ్‌లోకి వచ్చింది. ఇలా ఈ సెట్ చివరిదాకా ఉత్కంఠభరితంగా సాగింది. ఆఖరికి సింధు 22- 20 తేడాతో మొదటి సెట్‌ను కోల్పోయింది. ఇక రెండో సెట్ దాదాపు వన్‌సైడ్‌గా మారింది. యమగుచి ఆరంభం నుంచే ఆధిపత్యం చెలాయించింది. వరుసగా ఏడు పాయింట్లు రాబట్టి 13- 6తో మ్యాచ్‌పై పట్టు నిలుపుకుంది. ఆ తర్వాతా జోరు కొనసాగించిన యమగుచి రెండో సెట్‌ను 12- 21 భారీ తేడాతో నెగ్గి మ్యాచ్‌లో విజయం సాధించింది. వరసగా రెండు సెట్లలో నెగ్గిన యమగుచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఇక



రేపు జరగనున్న ఫైనల్‌లో యమగుచి, థాయ్‌లాండ్‌కు చెందిన పోర్న్‌పావి చోచువాంగ్‌తో తలపడనుంది. కాగా, ఈ ఏడాది సింధు ఇప్పటిదాకా ఒక్క టైటిల్ కూడా నెగ్గలేదు. ఆమె ఈ టోర్నీకి ముందు సింగపూర్, థాయ్‌లాండ్, ఇండోనేసియా ఓపెన్ సూపర్ టోర్నీల్లో క్వార్టర్ ఫైనల్ దాకా వెళ్లింది. కానీ క్వార్టర్స్‌లో ఓడిపోయింది. ఇక మలేసియా ఓపెన్ 500లోనూ సెమీఫైనల్ దాకా చేరుకుంది. సెమీస్‌లో చైనాకు చెందిన వాంగ్ జియితో 21-16, 21-15 తేడాతో సింధు ఓడింది. ఓవరాల్‌గా ఈ ఏడాది సింధుకు మలేసియా, ఆస్ట్రేలియా ఓపెన్ టోర్నీలు అత్యుత్తమ ప్రదర్శనలుగా చెప్పవచ్చు! రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత అయిన సింధు 2024లో లఖ్‌నవూలో జరిగిన సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్‌లో దీఔఖీ సర్క్యూట్‌లో చివరిసారిగా టైటిల్ గెలుచుకుంది. మరోవైపు ఇదే టోర్నమెంట్‌లో మరో యువ భారత క్రీడాకారిణి తన్వి శర్మ కూడా క్వార్టర్ ఫైనల్స్‌లోనే నిష్క్రమించింది. ఆమెను కూడా యమగుచినే ఓడించింది. అంతేకాకుండా, పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్లు కిరణ్ జార్జ్, తరుణ్ మనేపల్లి అనూహ్య ఓటములను చవిచూశారు. ఇక మహిళల సింగిల్స్‌లో సింధు, తన్వి శర్మ కూడా ఇంటి బాట పట్టడంతో భారత అభిమానులు నిరాశకు గురవుతున్నారు. ఈ మ్యాచ్‌కు ముందు సింధు రౌండ్ 32లో కాస్టిలోను మట్టికరిపించింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో సింధు 21-13, 21- 11 వరుస సెట్లలో నెగ్గింది. ఆ తర్వత రౌండ్ 16లో భారత ప్లేయర్ బరువాను ఢీ కొట్టింది. ఈ పోరులో ఆమె 22-20, 21-12 తో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. అక్కడ ఎస్ షెన్‌ను ఢీ కొట్టిన సింధు పూర్తిగా ఆధిపత్యం చలాయించింది. ఏకంగా 21- 6, 21- 9 భారీ తేడాతో గెలుపొంది సెమీస్‌కు దూసుకొచ్చింది. తాజాగా సెమీస్‌లో యమగుచితో ఓడిపోవడంతో ఈ టోర్నీలో సింధు జర్నీ ముగిసింది.

# జీ5లో ఫిఫా వరల్డ్ కప్..




ఫిఫా వరల్డ్ కప్ 2026 ప్రారంభానికి కొన్ని రోజుల ముందే ఇండియాలోని ఫుట్‌బాల్ ఫ్యాన్స్‌కు ఒక బిగ్ గుడ్ న్యూస్ అందింది. ఇండియాకు చెందిన ప్రముఖ బ్రాడ్‌కాస్టర్లు ఫిఫా సంస్థతో రేట్ల విషయంలో చర్చల లూప్‌లో ఇరుక్కుపోయిన వేళ, జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంది. తన సరికొత్త స్పోర్ట్స్ ఛానెల్ 'యునైట్8'), డిజిటల్ ప్లాట్‌ఫామ్ జీ5 ల ద్వారా ఈ మెగా టోర్నీని ఇండియాలో టెలికాస్ట్ చేయనుంది. ఈ బిగ్ డెసిషన్ వెనుక ఉన్న లాంగ్ టర్మ్ విజన్ గురించి యునైట్8 స్పోర్ట్స్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ భవేష్ జనవ్లేకర్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఫిఫా వరల్డ్ కప్ రైట్స్ కోసం ఇతర పెద్ద నెట్‌వర్క్‌లు వెనకడుగు వేసినా జీ గ్రూప్ ఎందుకు ముందుకు వచ్చిందనే దానికి భవేష్ క్లారిటీ ఇచ్చారు. స్పోర్ట్స్ అనేది తమకు షార్ట్ టర్మ్ గేమ్ కాదని, మార్కెట్ శబ్దాలను పట్టించుకోకుండా లాంగ్ టర్మ్ స్ట్రాటజిక్ నమ్మకంతోనే ఈ డెసిషన్ తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఫిఫా వరల్డ్ కప్ అనేది కేవలం ఒక టోర్నమెంట్ మాత్రమే కాదని, గ్లోబల్ స్పోర్ట్స్ ఇండస్ట్రీలో ఒక స్ట్రాంగ్ ఫౌండేషన్ క్రియేట్ చేయడానికి ఇది హెల్ప్ అవుతుందని చెప్పారు. ఇండియాలో యంగ్ అండ్ డిజిటల్ వ్యూయర్స్ ఇంట్రెస్ట్స్ మారుతున్నాయని, అందువల్ల మల్టీలింగ్వల్ కవరేజ్, రీజనల్ లాంగ్వేజెస్ సపోర్ట్‌తో ఈ మ్యాచ్‌లను అందరికీ అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. ఇండియాలో కేవలం క్రికెట్ మాత్రమే కాకుండా ఫుట్‌బాల్, కబడ్డీ లాంటి ఆటలకు కూడా విపరీతమైన క్రేజ్ పెరుగుతోందని భవేష్ అన్నారు. వెస్ట్ బెంగాల్, కేరళ, గోవా, నార్త్ ఈస్ట్ రాష్ట్రాల్లో ఫుట్‌బాల్‌కు ఒక కల్చరల్ కనెక్ట్ ఉందని గుర్తు చేశారు. ఆల్రెడీ జీ5 ద్వారా కలకత్తా ఫుట్‌బాల్ లీగ్, బెంగాల్ సూపర్ లీగ్ లను ప్రసారం చేసి సక్సెస్ అయ్యామని చెప్పారు. ఐఎల్‌టి20, యూపీ కబడ్డీ లీగ్ లాంటి ప్రాపర్టీస్ ద్వారా ఇండియా అంతటా అన్ని ప్రాంతాల ఆడియన్స్‌కు రీచ్ అవ్వడమే తమ టార్గెట్ అని వెల్లడించారు.




# ఓ సుకుమారి... టీజర్ విడుదల

తిరువీర్, ఐశ్వర్య రాజేశ్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఓ..! సుకుమారి'. భరత్‌దర్శన్ దర్శకుడు. గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రమిది. మహేశ్వరరెడ్డి మూలి నిర్మిస్తున్నారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శనివారం టీజర్ విడుదలైంది. ఒక్క నిజం దాచి పెట్టి కథానాయకుడిగా పెళ్లి చేస్తే ఏం జరిగిందన్న ఆసక్తికర అంశానికి వినోదాన్ని జోడించి ఈ మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. ఝాన్సీ, మురళీధర్‌గౌడ్, ఆనంద్, అంజిమామ, శివానంద్, కోట జయరామ్ తదితరులు నటిస్తున్నారు.

# 'మెగా158' సెట్స్‌లో సందడి..

## నటి నివేదా పేతురాజ్ కోసం కేక్ కటింగ్

మెగాస్టార్ చిరంజీవి హీరోగా, యువ దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వంలో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం చవీవస్త్రు158. ఈ సినిమా సెట్స్‌లో నటి నివేదా పేతురాజ్‌కు చిత్ర యూనిట్ ఒక స్పెషల్ సర్ప్రైజ్ ఇచ్చింది. నివేదా సినీ రంగంలోకి అడుగుపెట్టి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమె కోసం ప్రత్యేకంగా కేక్ కటింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అభినందనలు తెలిపింది. ఈ వేడుకకు సంబంధించిన వీడియోను నివేదా తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. అందులో ఆమె సహనటి అనస్వర రాజన్‌తో పాటు ఇతర చిత్ర బృంద సభ్యులకు కేక్ తినిపిస్తూ కనిపించారు.

'ఒరు నాల్ కూతు' అనే తమిళ చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసిన నివేదా పేతురాజ్, దశాబ్ద కాలంగా తన కెరీర్‌లో విజయవంతంగా కొనసాగుతున్నారు. ఈ మైలురాయిని పురస్కరించుకుని 'మెగా158' టీం ఆమెను గౌరవించడం విశేషం. ఇటీవలే ఈ సినిమాకు సంబంధించిన ఒక కీలక షెడ్యూల్ తమిళనాడులోని పొల్లాచ్చిలో విజయవంతంగా పూర్తయింది. ఈ షెడ్యూల్‌లో చిరంజీవితో పాటు ఇతర ప్రధాన తారాగణంపై ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరించినట్టు దర్శకుడు బాబీ కొల్లి తెలిపారు.





'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి, బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో చవీవస్త్రు158పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో యువ నటి అనస్వర రాజన్ మరో కీలక పాత్రలో నటిస్తోంది. ఈ సినిమా కోసం మెగాస్టార్ చిరంజీవి జిమ్‌లో తీవ్రంగా శ్రమిస్తున్న వీడియోను ఇటీవలే విడుదల చేసిన సంగతి తెలిసిందే.

ఈ చిత్రానికి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తుండగా, 'జైలర్', 'డాకు మహారాజ్' వంటి చిత్రాలకు పనిచేసిన విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. కొల్ల అవినాష్ ఆర్ట్ డైరెక్టర్‌గా, ఆంటోనీ రూబెన్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.





# వందే భారత్‌లో ప్రయాణం..

## ఎమోషనల్ అయిన సోనూ సూద్

ప్రముఖ సినీ నటుడు సోనూ సూద్ ఇటీవల వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తూ తన పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా భారతీయ రైల్వే సాధించిన ప్రగతిని ప్రశంసిస్తూ సోషల్ మీడియా వేదికగా తన అనుభవాలను పంచుకున్నారు.ప్రస్తుతం వందే భారత్ రైలులో ప్రయాణిస్తున్నానని పేర్కొన్న సోనూ సూద్, దేశంలోని రైల్వే వ్యవస్థ ఇంతగా అభివృద్ధి చెందడం గర్వకారణమని అన్నారు. రైలులోని ఆధునిక సౌకర్యాలు, నాణ్యమైన ఆహారం, సిబ్బంది ప్రవర్తన, ప్రయాణికులకు అందిస్తున్న సేవలు తనను ఎంతో ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ ప్రయాణం తన మొదటి రైలు ప్రయాణాన్ని గుర్తు చేసిందని ఆయన చెప్పారు. నాగ్‌పూర్‌లో చదువు పూర్తి చేసిన తర్వాత నటుడు కావాలనే కలతో ముంబైకి వెళ్లిన రోజులను గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో రైళ్లలో రిజర్వేషన్ కూడా దొరకక, పొడవాటి కంప్యూటర్ పేపర్లను మడతపెట్టి జనరల్ బోగీల్లో ప్రయాణించేవాళ్లమని తెలిపారు. రాత్రిళ్లు పడుకోవడానికి చోటు లేక రైలు టాయిలెట్‌ల దగ్గర నేలపై పేపర్లు పరుచుకుని నిద్రించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని చెప్పారు.అప్పటికీ, ఇప్పటికీ ఎంతో మార్పు వచ్చిందని, వందే భారత్ వంటి అత్యాధునిక రైళ్లను నడిపే స్థాయికి భారతీయ రైల్వే చేరుకోవడం గొప్ప విషయమని సోనూ సూద్ కొనియాడారు.

# హిట్ అండ్ రన్ ..క్రైమ్ థ్రిల్లర్




సంజయ్ రావ్, నటాషా సింగ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం 'హిట్ అండ్ రన్'. క్రైమ్, థ్రిల్లర్ జానర్‌లో రాబోతున్న ఈ సినిమాను సతీష్ రెడ్డి అల్లం, కె. శేఖర్ నిర్మిస్తున్నారు. ఈ మూవీకి సాయి కృష్ణ సాగర్ దర్శకత్వం వహిస్తున్నారు. రీసెంట్‌గా రిలీజ్ చేసిన సంజయ్ రావ్ పాత్ర, ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకున్నాయి. 'హిట్ అండ్ రన్' కాన్సెప్ట్ తెలిసేలా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ అందరిలోనూ అంచనాలు పెంచేసింది. తాజాగా రకుల్ ప్రీత్ సింగ్ 'హిట్ అండ్ రన్' సినిమాలోని హీరోయిన్ పాత్రకు సంబంధించిన లుక్‌ను రివీల్ చేశారు. నటాషా సింగ్ ఈ సినిమాలో రిపోర్టర్ సాక్షి అనే పాత్రలో కనిపించనున్నారు. పోస్టర్‌లో కనిపిస్తున్న కారు, వెనకాల ఉన్న డీటైల్స్ అన్నీ కూడా ఇంట్రెస్టింగ్‌గా ఉన్నాయి. ఇక హీరోయిన్ లుక్ కూడా చాలా డిఫరెంట్‌గా కనిపిస్తోంది. త్వరలోనే మేకర్స్ 'హిట్ అండ్ రన్' టీజర్‌తో అందరినీ మెస్మరైజ్ చేయనున్నారు. ఈ సినిమాకి ప్రిన్స్ హెన్రీ సంగీతాన్ని అందిస్తున్నారు. డి. వెంకట్ ప్రభు ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉంటే... ఇప్పటికే మోడల్‌గా రాణిస్తూ, పలు కమర్షియల్ యాడ్స్ లో నటిస్తున్న నటాషా సింగ్ తెలుగులో 'హైలెస్సో' మూవీలోనూ యాక్ట్ చేస్తోంది. సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న ఈ మూవీలో నటాషాతో పాటు నక్ష శరణ్ హీరోయిన్ నటిస్తోంది. అలానే అక్షర గౌడ కీలక పాత్ర పోషిస్తోంది. 'హైలెస్సో' మూవీ తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లోనూ విడుదల కానుంది. 'హిట్ అండ్ రన్, హైలెస్సో' చిత్రాలతో నటాషా ఎలాంటి గుర్తింపు తెచ్చుకుంటుందో చూడాలి.

# కలెక్షన్లలో దూసుకెళ్తున్న పెద్ది

## ఏకంగా రూ.366 కోట్ల గ్రాస్ వసూళ్లు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కించిన ఈ ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతూ భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ రెస్పాన్స్ అందుకున్న ఈ చిత్రం ఇప్పుడు రామ్ చరణ్ కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన సోలో చిత్రంగా నిలిచే దిశగా అడుగులు వేస్తోంది.ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా సంచలన వసూళ్లు నమోదు చేసిన 'పెద్ది' తాజాగా మరో కీలక మైలురాయిని అందుకుంది. సినిమా విడుదలై తొమ్మిది రోజులు పూర్తయిన సందర్భంగా చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా కలెక్షన్ల వివరాలను ప్రకటించింది. మేకర్స్ వెల్లడించిన సమాచారం ప్రకారం, 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా తొలి తొమ్మిది రోజుల్లో ఏకంగా రూ.366 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ఈ భారీ వసూళ్లతో రామ్ చరణ్ కెరీర్‌లో 'పెద్ది' రెండో అతిపెద్ద గ్రాసర్‌గా నిలిచింది. ముఖ్యంగా సోలో హీరోగా చరణ్ నటించిన చిత్రాల్లో అత్యధిక వసూళ్లు రాబట్టిన సినిమాగా ఇది రికార్డు సృష్టించింది. గ్రామీణ నేపథ్యం, క్రీడా అంశాలు, భావోద్వేగాలతో కూడిన కథ ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది.ప్రస్తుతం వీకెండ్ బుకింగ్స్ కూడా ఆశాజనకంగా ఉన్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'పెద్ది' త్వరలోనే రూ.400 కోట్ల గ్రాస్ క్లబ్‌లోకి చేరడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.




# హాలీవుడ్‌లో మైఖేల్ మూవీ చరిత్ర

## సుమారు రూ. 8,673 కోట్ల భారీ వసూళ్లు

పాప్ సింగర్ మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన బయోపిక్ 'మైఖేల్' ప్రపంచవ్యాప్తంగా సరికొత్త రికార్డులు సృష్టిచింది. ఇప్పటివరకు మ్యూజిక్ బయోపిక్ చిత్రాలలో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా ఉన్న 'బోహేమియన్ రాప్సోడి' రికార్డును ఈ చిత్రం తాజాగా దాటేసింది. హాలీవుడ్ మీడియా కథనాల ప్రకారం, 'మైఖేల్' సినిమా ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 911.9 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 8,673 కోట్లు) భారీ వసూళ్లను రాబట్టింది. దీంతో గతంలో 910.9 మిలియన్ డాలర్ల లైఫ్‌టైమ్ కలెక్షన్లతో అగ్రస్థానంలో ఉన్న 'బోహేమియన్ రాప్సోడి'ని ఇది వెనక్కి నెట్టి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. మరోవైపు 2022లో వచ్చిన ఎల్విస్ ప్రెస్లీ బయోపిక్ 'ఎల్విస్' రికార్డులను కూడా ఈ చిత్రం బద్దలు కొట్టింది. ఈ సినిమాకు ఆంటోయిన్ ఫుక్వా దర్శకత్వం వహించగా.. జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ రోల్‌లో నటించాడు. ఈ చిత్రం ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో రెంటల్ విధానంలో స్ట్రీమింగ్ అవుతుంది.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613